Follow: @ANNTELUGU

ANN తెలుగు

30-10-2025

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్  సంపుటి- 22  సంచిక- 324  పేజీలు-08  వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI  REGISTERED NUMBER: APTEL/2003/09316  WWW.EPAPER.MAHAADAILY.COM



## ఓటేస్తామంటే మోదీ డ్యాన్స్‌కైనా రెడీ

### బిహార్‌లో బీజేపీ రిమోట్ కంట్రోల్ సర్కార్

దేశసంపద కొంతమంది సంపన్నుల చేతుల్లోకి వెళ్లిపోతోంది

ప్రధాని మోదీపై ఎంపీ రాహుల్ గాంధీ హాట్ కామెంట్స్

**బిహార్, మహా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ బుధవారం శ్రీకారం చుట్టారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై పలు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. 'ఓట్ల కోసం ఆయన ఏదైనా చేస్తారు' అంటూ విమర్శలు గుప్పించారు. 'మహాగట్‌బంధన్' తరపున ముజఫర్‌పూర్‌లో జరిగిన ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, అధికార బీజేపీ ఎన్నికల చోరీకి పాల్పడుతోందని విమర్శించారు. ఓటరు కార్డుల అవకతవకలు, ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ఎన్నికల కమిషన్‌తో బీజేపీ కుమ్మక్కయిందని ఆరోపించారు.

మిగతా 2లో

టాప్ న్యూస్

కారు లేని అబ్బాయిలకు పిల్లను ఇవ్వట్లే..

- డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు


02



నేనొక్కడినే ఎందుకు తిట్లు తినాలి?

- భవిష్యత్‌లో ప్రతి రోడ్డుకు క్యూఆర్ కోడ్
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

02



బీహార్ వర్సెస్ ఢిల్లీ

- మహారాణి మళ్లీ
- సీజన్ 4 ట్రైలర్ రిలీజ్

02



# మంత్రివర్గంలోకి అజారుద్దీన్

## రేపు తెలంగాణ కేబినెట్ విస్తరణ

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ కీలకనిర్ణయం

### ఆగస్టులోనే చెప్పిన మహా పత్రిక

మంత్రి వర్గ విస్తరణపై రెండ్రోజులుగా ఏఐసీసీలో చర్చ

సీఎంను కలిసి థ్యాంక్స్ చెప్పిన అజరుద్దీన్ ..

మైనారిటీ క్రీడాశాఖ లేదా అటవీశాఖ కేటాయించే అవకాశం

**హైదరాబాద్, మహా** : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఏఐసీసీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర మంత్రి వర్గంలో మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు అవకాశం కల్పించనుంది. శుక్రవారం రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ కార్యక్రమం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి. అజారుద్దీన్‌తో గవర్నర్ మంత్రిగా ప్రమాణం చేయించన్నారు. అజారుద్దీన్ ను కేబినెట్ లో తీసుకోబోతున్నారంటూ మహా పత్రికలో ఆగస్టు 31న ప్రత్యేక కథనం ప్రచురితమైంది. జూబ్లీహిల్స్ రాజకీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కేబినెట్ లోకి తీసుకోవాలని హైకమాండ్ యోచనగా ఉండని పేర్కొంది. ఇపుడు అది నిజమవుతోంది. . మంత్రివర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ)లో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా, మరో ముగ్గురిని మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశముంది. అయితే ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజారుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతానికి మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుండి గతంలో అజారుద్దీన్ పోటీచేయగా, అజారుద్దీన్ స్థానంలో మరొకరికి అవకాశం కల్పించారు.

మిగతా 2లో

### లైన్‌లో రాజగోపాల్ ?


అజారుద్దీన్ కేబినెట్ బెర్త్ ఖరారు కాగా, మరో బెర్త్ కోసం రాజగోపాల్ రెడ్డి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో చివరినిమిషం దాకా ఏమైనా జరగొచ్చని పేర్కొంటున్నారు. గతంలో ఏఐసీసీ, ముఖ్యమంత్రి రెండుసార్లు తనకు స్పష్టమైన హామీలిచ్చారని, మూడో విస్తరణలోనైనా తనకు అవకాఃశం ఇవ్వాలని రాజగోపాల్ రెడ్డి కోరుతున్నట్లు తెలుస్తోంది. ఒకటి రెడ్డికి. మరొకటి మున్నూరుకాపుకు ఇవ్వాలన్న యోచనలో హైకమాండ్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మున్నూరు కాపు నుండి ఆది శ్రీనివాస్ లేదా దానం నాగేందర్ లలో ఒకరికి ఛాన్స్ దక్కవచ్చన్న ప్రచారాలున్నాయి.



### అజారుద్దీన్‌కు ఇచ్చే శాఖ ఇదే

మైనారిటీ క్రీడాశాఖ లేదా అటవీశాఖ కేటాయించే అవకాశం

వివరాలు 2లో



## ముంచేసిన మొంథా!

తెలంగాణపై తుఫాన్ తీవ్ర ప్రభావం.. రాష్ట్రవ్యాప్తంగా దంచికొడుతున్న వర్షాలు

హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రిలో భారీ వాన

నగరాల్లో, పట్టణాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం.. పలు జిల్లాల్లోని స్కూళ్లకు సెలవు

**హైదరాబాద్, మహా:** మొంథా తుపాను తెలంగాణపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు దంచి కొడుతున్నాయి. భారీ వర్షాల ధాటికి రాష్ట్ర తడిసి ముద్దయింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. నగరాల్లో, పట్టణాల్లో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. తాజాగా హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది.

మిగతా 4లో



## అధికారులు అలెర్ట్‌గా ఉండాలి


02

- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి
- ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలి
- తూఫాన్ ప్రభావం అధికంగా ఉన్న జిల్లాల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సమన్వయంతో పనిచేయాలి
- 'మొంథా'పై అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్

### హరీష్ రావు ఇంటికి బండి సంజయ్

వివరాలు 2లో

# పెద్ద కర్మ



## శ్రీ గడ్డం అఖిల్ రెడ్డి గారు

తేదీ 30-10-2025 గురువారం రోజున

ఉదయం 12 గంటలకు వారి పెద్దకర్మ జరుపబడును.

కార్యస్థలం : సిర్సన్న గ్రామం, బేలా మండలం, ఆదిలాబాద్




## చిరంజీవి ఆవేదన

మరోసారి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు

వివరాలు 2లో



జీసీసీల రాజధానిగా

## హైదరాబాద్

మా పాలన నమ్మకానికి ప్రతీక మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్

నెహ్రూ, పీవీ, మన్మోహన్ సింగ్‌ల దూర దృష్టితో హైదరాబాద్‌కు బలం

మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్ ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

02

# మంత్రివర్గంలోకి అజారుద్దీన్

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో ఎప్పుడు మంత్రివర్గ విస్తరణ జరిగినా, ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి కేటాయించడం ఆనవాయితీగా వస్తుంది. కాంగ్రెస్ పార్టీ తరపున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఎక్కడా విజయం సాధించలేదు. నాంపల్లి నుంచి ఫిరోజ్‌ఖాన్, షబ్బీర్ అలీ, అజారుద్దీన్ వంటి వారు ఓటమి చెందారు. దీంతో ఆ వర్గానికి కేబినెట్‌లో అవకాశం కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీకి సాధ్యపడలేదు. ముస్లిం మైనార్టీ వర్గానికి ఏదో విధంగా మంత్రివర్గంలో స్థానం కల్పించాలనే ఆలోచనతో కాంగ్రెస్ హైకమాండ్ ఉంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అజారుద్దీన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సైతం సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయం తీసుకుంది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇంకా ఆమోదం తెలుపలేదు. ఎమ్మెల్సీ నియామక ప్రక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యమంత్రి అజారుద్దీన్ ఎంపిక పట్ల సానుకూలంగా ఉండడంతో నిర్ణయం జరిగిపోయింది. బుధవారం సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి



అజారుద్దీన్ ధన్యవాదాలు తెలిపారు.

**గవర్నర్ కోటా కాకుంటే నిజామాబాద్ ?**

ఒక వేళ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అజాహరుద్దీన్‌కు అవకాశం దక్కని పక్షంలో త్వరలో కొన్ని శాసన మండలి స్థానాలు ఖాళీ కానున్నాయి. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత 6 నెలల లోపు అజాహరుద్దీన్‌ను ఎమ్మెల్సీని చేసే అవకాశముందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. గవర్నర్ కోటాలో జాప్యం జరిగితే నిజామాబాద్ స్థానికసంస్థల ఎమ్మెల్సీగా కవిత చేసిన రాజీనామాకు ఆమోదం లభిస్తే అక్కడ నుండి పోటీకి ఆస్కారం ఉండవచ్చన్న చర్చ జరుగుతోంది.

**ఏఐసీసీలో కసరత్తు**

మంత్రి వర్గ విస్తరణపై గత రెండ్రోజులుగా ఏఐసీసీలో విస్తృతంగా చర్చ జరిగినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మొదటి సారి సీఎం రేవంత్ రెడ్డితో పాటు 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో ముగ్గురు మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రస్తుతం మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశం ఉండటంతో కాంగ్రెస్ అధిష్ఠానం ముస్లిం మైనారిటీకి అవకాశం కల్పించింది.



## హరీష్ రావు ఇంటికి బండి సంజయ్

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ కీలక నేత హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ నిన్న ఉదయం మరణించిన సంగతి తెలిసిందే. కాగా నేడు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హరీష్ రావు నివాసానికి వెళ్లి.. ఆయన తండ్రి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం హరీష్ రావును ఓదార్చి, ధైర్యం చెప్పారు.



## బీహార్ వర్సెస్ ఢిల్లీ

### మహారాణి మళ్లీ సీజన్ -4 ట్రైలర్ రిలీజ్

**మహా:** బాలీవుడ్ భామ హ్యూమా ఖురేషి ప్రధాన పాత్రలో వచ్చిన పొలిటికల్ థ్రిల్లర్ సిరీస్ మహారాణి. ఇప్పటికే రిలీజైన మూడు సీజన్లు ఓటీటీ ప్రియులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. పొలిటికల్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ లలో మహారాణి వెబ్ సిరీస్ ముందు వరసలో ఉంటుంది. బీహార్ రాజకీయాల చుట్టూ ఆసక్తిగా తిరిగే ఈ సిరీస్.. ఫస్ట్ మూడు సీజన్లు సూపర్ డూపర్ సక్సెస్ అందుకున్నాయి. ఇపుడు మహారాణి వెబ్ సిరీస్ నాలుగో సీజన్ ఓటీటీకి వచ్చేస్తుంది. బాలీవుడ్ బ్యూటీ హ్యూమా ఖురేషి ప్రధానపాత్రలో నటించిన ఈ సిరీస్ సీజన్ 4 ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా సీజన్ 4 నవంబరు 7 నుంచి సోనీ లివ్లో స్ట్రీమింగ్ కానుందని తెలిపారు. బీహార్ రాజకీయాలను కళ్లకు కడుతున్న ఈ సిరీస్, ప్రతి సీజన్□కు ఉత్కంఠ రేపుతూ వెళ్తుంది. తొలి మూడు సీజన్స్□లలో హుమా ఖురేషీ 'రాణీ భారతి' పాత్రలో అదరగొట్టింది. ఇపుడు నాలుగో సీజన్‌లో కూడా ఆమె పాత్రను మరింత బలంగా తీర్చిదిద్దినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ఈ నాలుగో సీజన్ ద్వారా 'బీహార్ వర్సెస్ ఢిల్లీ' అనేలా రసవత్తరమైన రాజకీయ ఫైట్ ను ఉత్కంఠభరితంగా రూపొందించినట్లు స్పష్టమవుతోంది.

# అధికారులు అలెర్ట్ గా ఉండాలి

## ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి

- ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలి
- తుఫాన్ ప్రభావం అధికంగా ఉన్న జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ సమన్వయంతో పనిచేయాలి
- 'మొంథా'పై అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్

**హైదరాబాద్, మహా:** మొంథా తుఫాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆరా తీశారు. వరి కోతల సమయం కావడంతో పాటు పలు చోట్ల కళ్లాల్లో ధాన్యం ఆరబోసిన నేపథ్యంలో రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్గొండ జిల్లాల్లో మొంథా తుఫాన్ ప్రభావం అధికంగా ఉండగా, హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, గుండ్రాతిమడుగు స్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోవడంతో పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు దారిమళ్లించిన నేపథ్యంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. తూఫాన్ ప్రభావం అధికంగా ఉన్న జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని, జిల్లా కలెక్టర్లు ఆయా బృందాలకు తగిన మార్గదర్శకత్వం వహించాలని సూచించారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండి, లోతట్టు ప్రాంతాల కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలన్నారు.

**ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలి..**

నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లకు, క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో లో లెవల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలను పూర్తిగా నిషేధించాలని, పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించే అవకాశం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చెప్పారు. వైద్యారోగ్య శాఖ తగినంత మందులు అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం, పశునష్టం చోటు చేసుకోకుండా అన్ని శాఖలు జాగ్రత్తలు వహించాలన్నారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని ఆదేశించారు.

# ఇండియాలో తొలి డ్రైవర్ లెస్ కార్ రెడీ

## విప్రో సహకారంతో నిర్మాణం.. బెంగళూరులో ఫస్ట్ లుక్



**బెంగళూరు :** భారతీయ రోడ్ల సవాళ్లను ఎదుర్కొనేలా రూపొందించిన డ్రైవర్‌లెస్ కార్‌ను విప్రో, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (IISc), ఆర్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (RVCE) కలిసి తయారు చేశారు. 'విరిన్' పేరుతో ఈ వాహనాన్ని అక్టోబర్ 27న ఆర్వీసీఈ క్యాంపస్‌లో పరిచయం చేశారు. ఈ ఆవిష్కరణ ఆరు సంవత్సరాల కృషి ఫలితం. గంతలు, పశువులు, ట్రాఫిక్ రద్దీ వంటి భారతీయ రోడ్ల సమస్యలకు అనుగుణంగా రూపొందించిన ఈ కార్, ఏఐ, మెషిన్ లెర్నింగ్ ఆధారంగా పనిచేస్తుంది. ఆర్వీసీఈ క్యాంపస్‌లో జరిగిన పరిచయ కార్యక్రమానికి విప్రో ఆటోనమస్ సిస్టమ్స్ అండ్ రోబోటిక్స్ గ్లోబల్ హెడ్ రామచంద్ర బుధిహాల్, రాష్ట్రీయ శిక్షణ సమితి ట్రస్ట్ అధ్యక్షుడు ఎంపీ శ్యామ్, ప్రిన్సిపల్ కెఎన్ సుబ్రమణ్యలు పాల్గొన్నారు. ఈ కార్‌లో ఉత్తరాది మఠాధిపతి కూర్చుని ప్రయాణించిన 28 సెకన్ల వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## అజారుద్దీన్ కు ఇచ్చే శాఖ ఇదే...

### మైనారిటీ క్రీడాశాఖ లేదా అటవీశాఖ కేటాయించే అవకాశం

**హైదరాబాద్, మహా :** మాజీ క్రికెటర్, మాజీ ఎంపీ అజారుద్దీన్ తెలంగాణ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖాయం కాగా, ఆయనకు దక్కే శాఖపై చర్చ జరుగుతోంది. అజారుద్దీన్ కు మైనారిటీ వ్యవహారాలు కేటాయిస్తే ప్రస్తుతం అడ్లూరి లక్ష్మణ్ నుండి ఆ శాఖను అజారుద్దీన్ కు బదలాయించే అవకాశాలున్నాయి. క్రీడలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుండడం, అజారుద్దీన్ భారత క్రికెట్ జట్టు కెప్టెన్ గా దేశానికి అద్భుత విజయాలు అందించిన చరిత్ర ఉండడంతో రాష్ట్ర క్రీడారంగానికి కూడా ఆయన చరిత్ర , సేవలు ఉపయోగపడే అవకాశాలున్నాయి. ముఖ్యమంత్రికి క్రీడల పట్ల ప్రత్యేక ఆసక్తి ఉంది. ఈ శాఖ ప్రస్తుతం పాలమూరు జిల్లాకు చెందిన వాకిటి శ్రీహరి దగ్గర ఉంది. మరోవైపు ఇటీవల కాలంలో అటవీశాఖపై ఆరోపణల నేపథ్యంలో కొండా సురేఖ నుండి ఆ శాఖను అజారుద్దీన్ బదలాయించవచ్చన్న ప్రచారాలు కూడా ఉన్నాయి. హైకమాండ్ ఎవరి శాఖల్లో మార్పు చేస్తుందో.. ఎవరికీ కేటాయించని శాఖ అప్పజెపుతుందో చూడాలి.



## చిరంజీవి ఆవేదన

### మరోసారి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు

**హైదరాబాద్, మహా :** టాలీవుడ్ స్టార్ హీరో మెగాస్టార్ చిరంజీవి మరోసారి సైబర్ క్రైమ్ పోలీసుల్ని ఆశ్రయించారు. ఇటీవలే డీప్ ఫేక్, తన అనుమతి లేకుండా పేరు, వాయిస్, ఫొటోలను వాణిజ్య ప్రకటనలకు వాడుకోవడంపై చిరంజీవి ఫిర్యాదు చేశారు. తాజాగా తనపై సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు పెడుతున్నారని పేర్కొంటూ ఒక ఎక్స్ హ్యాండిల్ డీటెయిల్స్ తో కంప్లైంట్ చేశారు. హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఇటీవలే తీర్పు ఇచ్చినా.. ఇంకా ఇలాంటి పోస్టులు పెడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. చిరంజీవి ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు.. కేసు నమోదు చేశారు. టీఆర్పీ, లాభాల కోసం చిరంజీవి అనుమతి లేకుండా ఆయన పేరు, వాయిస్, ఫొటోలను వాడి దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశిస్తూ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఇటీవలే ఆదేశాలు జారీ చేసింది.

## నేనొక్కడినే ఎందుకు తిట్లు తినాలి?

### భవిష్యత్‌లో ప్రతి రోడ్డుకూ క్యూఆర్ కోడ్

### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన రోడ్లపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సంచలన వ్యాఖ్యలు చేశారు. మెయిన్ రోడ్లపై క్యూఆర్ కోడ్ స్కానర్లను ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. 'స్మార్ట్ రోడ్ల భవిష్యత్తుభద్రత' అనే అంశంపై ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో గడ్కరీ మాట్లాడారు. "రోడ్లు బాగా లేకపోతే అందరూ నన్నే తిడతారు.. మొత్తం సిస్టమ్ చేసిన మిస్టేక్కు నేను మాత్రమే ఎందుకు తిట్లు తినాలి. అందుకోసమే రోడ్లకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలియజేసేందుకు భవిష్యత్ లో క్యూఆర్ కోడ్లను తీసుకొస్తం.. రోడ్లపైన స్కానింగ్ బోర్డులు ఏర్పాటు చేస్తం. స్మార్ట్ ఫోన్లో స్కాన్ చేయగానే రోడ్డుకు సంబంధించిన సమాచారం వచ్చేస్తుంది. రోడ్లు ఎవరు వేశారు?.. కాంట్రాక్టర్ ఎవరు? ఎవరెవరు పనులు చేశారో వాళ్ల సమాచారం.. ఫోన్ నెంబర్లతో సహా వచ్చేస్తుంది. అప్పుడు ఎలాంటి ఇబ్బంది ఉండదు. రోడ్ల నిర్మాణంలో అవినీతికి పాల్పడే అధికారులకు ప్రజలే బుద్ధి చెబుతారు' అని అన్నారు.

# జీసీసీల రాజధానిగా హైదరాబాద్

## మా పాలన నమ్మకానికి ప్రతీక మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్

### నెహ్రూ, పీవీ, మన్మోహన్ సింగ్‌ల దూర దృష్టితో హైదరాబాద్‌కు బలం

### మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్ ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్, మహా:** తెలంగాణ ప్రతిభపై విశ్వాసం పరిపాలనపై నమ్మకానికి మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్ ఒక ప్రతీక అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి టీహబ్ సమీపంలో మ్యాక్ డోనాల్డ్ గ్లోబల్ ఆఫీస్‌ను ప్రారంభించిన అనంతరం భట్టి ప్రసంగించారు. తెలంగాణ అద్భుత ప్రతిభకు మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్ కోసం హైదరాబాదును కేంద్రంగా ఎంచుకోవడం ఒక నిదర్శనం అన్నారు. జీసీసీలకు రాజధానిగా హైదరాబాద్ నిలిచిందని తెలిపారు. మాజీ ప్రధాని నెహ్రూ మొదలుకొని ఆ తర్వాత పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ వంటి మహానేతలు దూరదృష్టితో చేపట్టిన చర్యల మూలంగా హైదరాబాద్‌కు మరింత బలం చేకూరిందని డిప్యూటీ సీఎం వివరించారు. మ్యాక్‌డొనాల్డ్స్ గ్లోబల్ నాయకత్వ బృందాన్ని హైదరాబాద్‌కు స్వాగతించడం నాకు ఎంతో ఆనందంగా ఉంది, ఇది ఇప్పుడు మీ ప్రపంచ ప్రతిభకు కొత్త నిలయం అని కంపెనీ ప్రతినిధులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం అన్నారు. దశాబ్దాల క్రమంలో ఆ బంగారు చిహ్నాలు ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ కోట్లాది మందికి సేవలు అందించే విధంగా ఆవిష్కరణ, నిర్వహణ కలయికకు చిహ్నమయ్యాయని డిప్యూటీ సీఎం వివరించారు. మార్క్ నాప్లర్ రాసిన "Boom, Like That" పాటలో —— మెక్‌డొనాల్డ్స్ వ్యవస్థాపకుడు రే క్రాక్ కథకు ప్రేరణగా చెప్పినట్లుగా మ్యాక్‌డొనాల్డ్స్ కథ అనేది ఒకేసారి ఒక పల్లెలో ప్రపంచమంతా వ్యాపించిందన్నారు. ఒక రకంగా చెప్పాలంటే, హైదరాబాద్ కూడా అలాంటి ప్రయాణమే చేసింది అన్నారు. మినార్లు, సరస్సులతో ఉన్న చారిత్రక నగరం నుండి, డేటా, డిజైన్, నిర్ణయాల గ్లోబల్ హబ్‌గా ఎదిగిందన్నారు.

భారతదేశ అభివృద్ధి క్రమాన్ని పరిశీలిస్తే పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దూరదృష్టిని మరవలేమని భట్టి గుర్తు చేశారు. ఆయన ఆధునిక భారతదేశానికి పునాదులు వేశారు, వారి దూరదృష్టి పెట్టుబడి వల్లే హైదరాబాద్‌కు స్థిరమైన బలం వచ్చింది చేకూరిందన్నారు. సీసీఎంబీ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, బీహెచ్ఈఎల్, ఈసీఎల్, ఇతర పబ్లిక్ సెక్టర్ సంస్థలు అన్నీ కూడా నెహ్రూ స్ఫూర్తి నుండి పుట్టినవే అని పేర్కొన్నారు. వారి తర్వాత ప్రధానిగా పనిచేసి పీవీ నరసింహారావు, వారి క్యాబినెట్‌లో డాక్టర్ మన్మోహన్ సింగ్, ఆర్థిక మంత్రిగా నెహ్రూ దూరదృష్టిని మరింత బలంగా తీసుకెళ్లారని చెప్పారు. భారతదేశాన్ని ప్రపంచంతో ఆత్మవిశ్వాసంగా, జాగ్రత్తగా, కరుణతో అనుసంధానించారు అని వివరించారు. ఆర్థిక సంస్కరణ అంటే కేవలం మార్కెట్ గురించి కాదు, గౌరవంతో కూడిన అవకాశాలను సృష్టించడం అని తెలిపారు. ఆలోచనలో భాగంగానే సమానత్వంతో కూడిన వృద్ధి, సమిష్టి అభివృద్ధి అనే అంశాలు ఈరోజు తెలంగాణ ప్రభుత్వానికి మార్గదర్శక సూత్రాలు అని డిప్యూటీ సీఎం తెలిపారు. గత రెండు దశాబ్దాల్లో హైదరాబాద్ ఇటువంటి సెంటర్లకు రాజధానిగా మారింది, వందలాది గ్లోబల్ కెపబిలిటీ హబ్‌లు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని వివరించారు. హైదరాబాదులోని జీసీసీ సెంటర్లు చికాగోను చార్మినార్‌తో, బోస్టన్‌ను బంజారాహిల్స్‌తో, లండన్‌ను లింగంపల్లితో కలుపుతున్నాయి, హైదరాబాద్‌ను ప్రపంచ కమాండ్ సెంటర్‌గా మార్చుతున్నాయని, అక్కడ మార్కెట్లను, అనుభవాలను తీర్చిదిద్దే నిర్ణయాలు తీసుకోబడుతున్నాయని అన్నారు. మనమందరం కలిసి, ప్రపంచంలోని ఉత్తమ ఆలోచనలకు భారతదేశంలోని అత్యంత చురుకైన హైదరాబాదులో అవకాశం కల్పిద్దామని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో డోనాల్డ్ కంపెనీ ప్రతినిధులు మిస్ స్కై ఆండర్సన్, దేశాంత్ కైలా, మ్యాటిజ్ బ్యాక్స్, స్పీరో డ్రూలియాస్, శదాస్ దాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



## కారు లేని అబ్బాయిలకు పిల్లను ఇవ్వట్లే..

### డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు

**బెంగళూరు:** కారు లేని అబ్బాయిలకు పిల్లను ఇవ్వడానికి కూడా ప్రజలు ఆలోచిస్తున్నారని కర్నాటక డిప్యూటీ సీఎం డికె శివకుమార్ అన్నారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం టన్నెల్ రోడ్ ప్రాజెక్టును సమర్థిస్తోంది. అయితే ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణానికి హాని కలుగుదుంతని ప్రజారవాణా విషయంలో ఇది సరైన పరిష్కారం కాదని బీజేపీ వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య డీకేను కలిశారు. ఈ టన్నెల్ ప్రాజెక్టును రద్దు చేసి మాస్ ట్రాన్స్ పోర్టును విస్తరించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడిన డీకే శివకుమార్.. ప్రజలు కార్లు కొనుగోలు చేయడం వెనుక ఉన్న సామాజిక పరిస్థితి సూర్యకు అర్థం కావడం లేదని, మీరు సొంత వాహనంలో రాకుండా నేను ఆపగలనా? అని ప్రశ్నించారు. ప్రజలు తమ కుటుంబాలతో కలిసి సొంత వాహనాల్లో వెళ్లడానికి ఇష్టపడుతున్నారు. వారిని కార్లు వాడొద్దని చెప్పగలమా? అంతగా అవసరం అనుకుంటే ప్రజా రవాణా వాడుకోమని తమ నియోజకవర్గ ప్రజలకు ఎంపీలు విజ్ఞప్తి చేయవచ్చన్నారు. అయితే దీనిని ఎంత మంది వింటారో చూడాలని కారులేని అబ్బాయిలకు పిల్లను కూడా ఇవ్వడానికి ఇష్టపడటం లేదని అన్నారు.



## కాంగ్రెస్‌లోకి మాజీ కార్పొరేటర్

### సీఎం సమక్షంలో పార్టీలో చేరిన కిలారి మనోహర్

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, వెంగళరావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం సీఎం నివాసంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సమక్షంలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మనోహర్‌కి కండువా కప్పి పార్టీలోకి టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిక్కసాని నాగేశ్వరరావు, పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు

## ఓటేస్తామంటే మోదీ డ్యాన్స్‌కైనా రెడీ

### బిహార్‌లో బీజేపీ రిమోట్ కంట్రోల్ సర్కార్

### దేశసంపద కొంతమంది సంపన్నుల చేతుల్లోకి వెళ్లిపోతోంది.. ప్రధాని మోదీపై ఎంపీ రాహుల్ గాంధీ హాట్ కామెంట్స్

(మొదటిపేజీ తరువాయి)

'ఆయనకు (మోదీ) మీ ఓట్లు మాత్రమే కావాలి. మీ ఓట్లకు బదులుగా ఆయనను డాన్స్ చేయమని చెబితే, ఆయన వెంటనే డాన్స్ చేస్తారు. వాళ్లు మహారాష్ట్రలో ఎన్నికల చోరీకి పాల్పడ్డారు. హర్యానాలోనూ ఇదే పని చేశారు. ఇప్పుడు బీహార్‌లో ఎన్నికల చోరీకి ప్రయత్నిస్తున్నారు' అని రాహుల్ అన్నారు. ఢిల్లీలో కాలుష్యంతో నిండిన యమునా నది ఒడ్డున ప్రత్యేకంగా ఒక చెరువు నిర్మించినట్టు వస్తున్న వార్తలపైనా రాహుల్ స్పందించారు. 'అక్కడ యమున లేదు. చెరువు మాత్రమే ఉంది. ఫిల్టర్ వాటర్ నింపారు. ప్రధానమంత్రి తన స్విమ్మింగ్ పూల్‌లో స్నానం చేయడానికి వెళ్లారు. సామాన్య ప్రజానీకం మాత్రం యమునా నది మురికి జలాల్లో ఛాత్ ప్రార్థనలు చేస్తున్నారు. ఆయనకు యుమునా నదితో సంబంధం లేదు. ఛత్ పూజతో సంబంధం లేదు. ఆయనకు మీ ఓటు మాత్రమే కావాలి' అని రాహుల్ వ్యంగ్యోక్తులు గుప్పించారు.

**రూ.500కే సిలిండర్: తేజస్వీ యాదవ్**

తాము అధికారంలోకి వస్తే రూ.500కే వంటగ్యాస్ సిలిండర్లు అందజేస్తామని ఆర్జేడీ నేత, 'మహాగఠ్‌బంధన్' సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ ప్రకటించారు. ఇటీవల కాలంలో ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంలో తీసుకున్న అనేక ప్రజాకర్షక చర్యలు.. గతంలో తాను ఇచ్చిన హామీలకు నకలు అని విమర్శించారు. బయటి వ్యక్తుల నియంత్రణలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దెదించాలని పిలుపునిచ్చారు. అవినీతి, శాంతిభద్రతలపై రాజీలేని వైఖరిని అవలంబిస్తానని తెలిపారు.



## విద్యార్థులకు శుభవార్త

- రూ. 303 కోట్ల ఓవర్సీస్ స్కాలర్‌షిప్ బకాయిలు రిలీజ్
- 2022 నుంచి ఉన్న పెండింగ్‌ను క్లియర్ చేయాలని భట్టి ఆదేశం

**హైదరాబాద్, మహా:** పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసి, మైనారిటీ విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్షిప్ బకాయిలు 303 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆర్థికశాఖ అధికారులను ఆదేశించారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ బకాయిల మొత్తాన్ని ఒకేసారి క్లియర్ చేయాలని ఆదేశించారు. నిరాశ, నిస్పృహల్లో ఉన్న వేల కుటుంబాల్లో డిప్యూటీ సీఎం ఆదేశాలు ఆనందం నింపాయి. కష్టకాలంలో ప్రభుత్వం ప్రతి విద్యార్థికి సుమారు 20 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో తమ బిడ్డలు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని, తమ ఇబ్బందులు తొలగిపోతాయని ఆ కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. కష్టకాలంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించి రాష్ట్రానికి, దేశానికి తిరిగి అర్థవంతమైన సేవలు అందించే అవకాశం కలుగుతుందని ఆశాభావంతో ఉన్నట్టు ఓవర్సీస్ విద్యార్థులు తెలిపారు.

## తెలంగాణలో ఇంజినీరింగ్ కాలేజీలకు షాక్

**ప్రభుత్వం సంచలన ఉత్తర్వులు**

**పోలీస్, విద్యాశాఖ అధికారులు సహకారంతో తనిఖీలు**

**హైదరాబాద్, మహా :** ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ఇంజినీరింగ్ సహా ఉన్నత విద్యా కాలేజీలకు తెలంగాణ ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులలో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు రావడంతో విజిలెన్స్ తనిఖీలకు ఆదేశించింది. అన్ని కాలేజీల్లోనూ తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేసింది. పోలీస్, విద్యాశాఖ అధికారులు సహకారంతో తనిఖీలు చేపట్టి, నివేదిక సమర్పించాలని సూచించింది. మరోవైపు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని ఆరోపిస్తూ తెలంగాణలోని అన్ని ప్రయివేట్ ఉన్నత విద్యా సంస్థలు నవంబరు 3 నుంచి కాలేజీలను మూసివేస్తామని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విజిలెన్స్ తనిఖీలకు ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో సర్కారు స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం, గతంలో ఇచ్చినవాటిని నెరవేర్చకపోవడంతో ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య బంద్‌కు పిలుపునిచ్చింది. దసరాకు రూ. 600 కోట్లు విడుదల చేస్తామని, కేవలం రూ. 200 కోట్లతో సరిపెట్టింది. దీపావళి నాటికి మొత్తం బకాయిలు క్లియర్ చేస్తామని చెప్పినా ఆ హామీ కూడా నెరవేరలేదు. దీంతో తక్షణమే బకాయిల విడుదలపై స్పష్టత ఇవ్వాలని కాలేజీల సమాఖ్య డిమాండ్ చేస్తోంది. దాని ప్రతినిధులు మంత్రులను కలిసి తమ సమస్యను వివరించాయి. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో బంద్‌ను ఎంచుకున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు రావడంతో గత ప్రభుత్వ హయాంలోనే విచారణకు ఆదేశించింది. ఇటీవల ప్రయివేట్ కాలేజీల యాజమాన్యాలతో జరిగిన చర్చల్లో ఈ అంశాన్ని ప్రభుత్వం ప్రస్తావించింది.

## కాంగ్రెస్‌కు ఓటమి భయం

- మైనార్టీ ఓట్ల కోసం అజారుద్దీన్‌కు మంత్రి పోస్ట్
- బీజేపీ ఎంపీ డీకే అరుణ ఫైర్

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయం కాంగ్రెస్‌కు పట్టుకుందని బీజేపీ ఎంపీ డీకే అరుణ విమర్శించారు. దాంతో ఎలాగైనా గెలవాలని కుయుక్తులు చేస్తోందని మండిపడ్డారు. మైనార్టీ ఓట్ల కోసం అజారుద్దీన్‌ను మంత్రి చేయబోతున్నారని, బీఆర్ఎస్ కూడా బీజేపీని నిలువరించాలనే యత్నంచేస్తోందన్నారు. 'ఎన్నికల్లో ఓడిపోతున్నరనే భయం కాంగ్రెస్‌కు పట్టుకుంది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటే ఇలాంటి పనులు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్ జూబ్లీహిల్స్‌లో ఓడిపోతుంది. ఉపాధి కోసం వలస వచ్చిన వారే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేసింది శూన్యం. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ కూడా ఒక్క పని చేయలేదు. కాంగ్రెస్ ఏం మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతుంది. రెండేళ్లుగా మైనార్టీకి మంత్రి పదవి గుర్తు రాలేదు ఓడిపోతామని తెలిసి మంత్రి పదవి నాటకం. ఓట్ల కోసం ఏ గడ్డి తినడానికి కాంగ్రెస్ రెడీ. మోదీ కేంద్ర ప్రభుత్వ నిధులు లేకుంటే రాష్ట్రంలో అభివృద్ధే లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలలే ఉంటదని ఆ పార్టీ మంత్రులు ఎమ్మెల్యేలే అంటున్నారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలే ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారు బీజేపీ తప్పకుండా జూబ్లీహిల్స్‌లో గెలుస్తుంది' అని స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ గెలిస్తే ఏమైనా జరగొచ్చు

### కాంగ్రెస్ పైసలు ఇస్తే తీసుకోవాలి.. ఓటు మాత్రం బీఆర్ఎస్ కు

### మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ బెదిరింపులకు దిగుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే ఏమైనా జరగొచ్చని.. మూడేళ్ళ వరకు ఎదురు చూడాల్సిన అవసరం ఉండదని తెలిపారు. కాంగ్రెస్ పైసలు ఇస్తే తీసుకోవాలని.. కానీ ఓటు మాత్రం బీఆర్ఎస్‌కు వేయాలని కోరారు. కత్తి వాళ్లకు ఇచ్చి.. యుద్ధం తమను చేయమంటే ఎలా అని ప్రశ్నించారు. కత్తి తమకు ఇవ్వాలని... కాంగ్రెస్‌తో యుద్ధం చేసే బాధ్యత తమది అని స్పష్టం చేశారు. ఎస్సీలు, ఎస్టీలు, ముస్లింలు, మహిళలు, వృద్ధులు అందరూ బాధపడుతున్నారని కేటీఆర్ అన్నారు. కోటి మందిని కోటీశ్వరులను చేయడం ఏంటో కానీ.. మహిళలకు ఇస్తామన్నవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. భర్త చనిపోతే భార్యకు బాధ ఉండదా..? మాగంటి సునీతపై కామెంట్ చేయడానికి మంత్రులకు సిగ్గు ఉండాలంటూ ఫైర్ అయ్యారు. వాళ్ల కుటుంబంలో ఎవరైనా చనిపోతే కాంగ్రెస్ నేతలకు బాధ కలగదా అంటూ నిలదీశారు. కాంగ్రెస్ అభ్యర్థి సోదరుడికే మూడు ఓట్లు ఉన్నాయంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రజలు ఎలాగూ ఓటేయరని తెలిసి.. దొంగ ఓట్లతో గెలవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.




ప్రజలు అప్రమత్తంగా లేకపోతే.. వారి ఓటు కూడా ఎవరో ఒకరు వేసేస్తారని తెలిపారు. అది జరగకుండా.. ప్రజలు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని వినతి చేశారు. మున్నూరు కాపులను కేసీఆర్ ఎలా చూసుకున్నారో అందరికీ తెలుసన్నారు. మున్నూరు కాపులకు సముచిత గౌరవం, సముచిత ప్రాధాన్యం ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే అని చెప్పుకొచ్చారు. రైతులకు దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని మంచి పనులు కేసీఆర్ చేశారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు కూడా సరిగా ఉండట్లేదని విమర్శించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత ఫ్రీ వాటర్ స్కీం కూడా ఎత్తేస్తారని.. ఒక ఇంటర్వ్యూలో సీఎం రేవంత్ రెడ్డే ఈ విషయాన్ని బయటపెట్టారని తెలిపారు. ఒక్క కొత్త రోడ్డు లేదని.. కొత్త బ్రిడ్జ్ లేదని.. కొత్త బిల్డింగ్ కట్టలేదని విమర్శించారు. కానీ.. కేసీఆర్ కట్టిన బిల్డింగ్‌లను మాత్రం ఓపెన్ చేస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అంటూ బీసీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేస్తేనే జరుగుతుందని బీఆర్ఎస్ ముందే చెప్పిందన్నారు. రేవంత్ .. తన చేతిలో లేని ముచ్చట చెప్తూ.. ఇవ్వాల్సిన వాటి గురించి మాట్లాడరంటూ ఎద్దేవా చేశారు. పార్లమెంట్‌లో బిల్లు పెడితే బీఆర్ఎస్ కూడా మద్దతు ఇస్తుందని చెప్పామని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

## సైకిల్ రైడర్స్ లో జోష్ నింపిన పోలీస్ కమిషనర్





**హన్మకొండ మహా;** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకోని నిర్వహించిన సైకిల్ ర్యాలీలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తో పాటు, యువత, విద్యార్థులు, చిన్నారులు, వృద్దులు,పోలీసులు ఉత్సహంగా పాల్గొన్నారు. ఈ ర్యాలీలో వరంగల్ పోలీస్ కమిషనర్ తో పాటు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ తో పాటు చాహత్ బాజ్ పాయి, ఎన్.డి.పి సి.ఎల్ సి యం డి వరుణ్ రెడ్డి, ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ పాల్గొన్న ఈ ర్యాలీని అదనపు డిసిపిలు రవి, సురేష్ కుమార్ పచ్చా జెండా ఊపి ప్రారంభించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయము నుండి అంబేద్కర్ సెంటర్, ఆదాలత్ సెంటర్, హన్మకొండ కలెక్టర్ కార్యాలయం నుండి తిరిగి ఇదే మార్గం నుండి నక్కలగుట్ట మీదగా పోలీస్ కమిషనరేట్ కార్యాలయమునకు చేరుకున్నారు. ఈ ర్యాలీ వరంగల్ పోలీస్ కమిషనర్ సైకిలింగ్ రైడర్స్‌తో కల్సి పోలీస్ అమర వీరులకు జోహర్లు నినాదాలు చేస్తు రైడర్స్ ను ఉత్సహ పర్చారు. అనంతరం ఈ సైకిల్ ర్యాలీబూ పాల్గోన్న సైకిల్ రైడర్లకు పోలీస్ అధికారుల చేతుల మీదుగా సర్టిఫికేట్లను ప్రధానం చేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి రోజు సైకిలింగ్ చేయడం ద్వారా మరింత ఆరోగ్యంగా వుండటంతో పాటు, రోజంతా ఉత్సహంగా తమ విధుల్లో రాణించవచ్చని, ప్రతి ఒక్కరు సైకిలింగ్ కోసం కొద్ది సమయాన్ని కేటాయించడం ద్వారా ఆరోగ్య సమస్యలు దూరం కావవ్చని, అలాగే పోలీస్ అమరవీరులను స్మరిస్తూ నిర్వహించిన ఈ ర్యాలీలో పాల్గోన్న ప్రతి ఒక్కరికి పోలీస్ అమరవీరుల కుటుంబాలతో పాటు, పోలీసుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్, ఎన్.డి.పి సి.ఎల్ సి యం డి మాట్లాడుతూ నిత్యం సైకిలింగ్ చేయడం మన ఆరోగ్యాన్ని పరి రక్షించుకోవచ్చని, సైకిలింగ్ చేయడం రోజు వారి అలవాటుగా మార్చుకోవాలని తెలిపారు. ఈ ర్యాలీలో అదనపు డిసిపి లు, శ్రీనివాస్, ప్రభాకర్, బాలస్వామి, ఏ ఎస్పీ శుభం, ఏసిపిలు జితేందర్ రెడ్డి, నర్సింహా రావు, అనంతయ్య, నాగయ్య, సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఏ.జే పెడల్స్ యాజమాన్యం, ట్రైసిటి సైకిల్ రైడర్స్, పబ్లిక్ గార్డెన్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, నిట్ కళాశాల విద్యార్థులతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.

## డిజిపి కార్యాలయంలో తొలిసారి రక్తదాన శిబిరం నిర్వహణ

**హైదరాబాద్, మహా :** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమాల సందర్భంగా బుధవారం డిజిపి కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తొలిసారిగా డిజిపి కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి రక్తదానం చేశారు. శాంతి భద్రతల అడిషనల్ డిజిపి శ్మహేష్ ఎం భగవత్, ఐజిపి లు ఎస్ చంద్రశేఖర్ రెడ్డి, ఎం.రమేష్ లతో సహా 164 మంది పోలీస్ సిబ్బంది తో పాటు ఆదిక సంఖ్యలో పాల్గొన్న మినిస్టీరియల్ సిబ్బంది నుండి రెడ్ క్రాస్ సొసైటీ నిర్వాహకులు రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా డిజిపి బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ..... రక్తదానం చేయడం వల్ల మనుషులను ప్రాణాపాయం నుండి కాపాడగలుగుతామన్నారు. రక్తదానం చేయడం వల్ల మూడు రకాలుగా మనుషులకు ఉపయోగపడుతుందని అన్నారు. ఒకరు రక్త దానం చేయడం వల్ల రక్తంతో పాటు, ప్లాస్మా, ప్లేట్లెట్స్ వంటివి మరో ముగ్గురికి ప్రాణదానం చేసే ఆస్కారం ఉందని అభిప్రాయపడ్డారు. బాధితులకు అవసరమైన రక్తాన్ని సేకరించేందుకు అవకాశమున్న ప్రతి ఒక్కరు ముందుకు రావాలని డిజిపి పిలుపునిచ్చారు. గత రెండు రోజుల క్రితం హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్నానని, దాదాపు 4,500 యూనిట్ల రక్తాన్ని వారు సేకరించారని వెల్లడించారు. ఏటా ప్రతి ఒక్కరు నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని వైద్యులు చెప్తున్నారని, కనీసం ఒకసారి రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడగలుగుతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో దాదాపు 8,000 మంది ప్రాణాలు కోల్పోతున్నారని రక్తం అందుబాటు ఉన్నట్లయితే అందులో కొంతమంది ప్రాణాలైనా కాపాడగలిగే అవకాశం ఉంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఐజిపి (పి&ఎల్) ఎం రమేష్ స్వాగతోపన్యాసం చేస్తూ... రక్తదాన శిబిరం డిజిపి కార్యాలయంలో నిర్వహించడం ఇది తొలిసారి అని పెద్ద ఎత్తున పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## వరంగల్ తూర్పు నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షా సమావేశం

- తూర్పులో అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి
- బల్దియాలో పూర్తిస్థాయి అధికారులను వెంటనే నియమించాలి: మంత్రి కొండా సురేఖ
- సమీక్షా సమావేశం లో పాల్గొన్న నగర మేయర్, కమిషనర్



**వరంగల్ మహా ;** వరంగల్ తూర్పు నియోజకవర్గం లో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువు లోగా త్వరగాపూర్తి చేయాలని రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో నగర మేయర్ గుండు సుధారాణి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ బల్దియా, ఇరిగేషన్, రెవెన్యూ, కుడా అధికారులతో వరంగల్ (తూర్పు) నియోజకవర్గంలోని అన్ని డివిజన్ లలో పూర్తయిన, కొనసాగుతున్న అభివృద్ధి పనులను కూలంకుషంగా చర్చించి సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా అధికారులు అభివృద్ధి పనుల తీరు ను తెలియజేస్తూ వరంగల్ (తూర్పు) నియోజకవర్గం లోని 24 డివిజన్ల లో ఇప్పటివరకు 673 పనులను రూ .108 కోట్లతో చేపట్టగా అందులో రూ. 25 కోట్లతో 360 పనులు పూర్తి కావడం జరిగిందని రూ. 19 కోట్ల తో చేపట్టిన 69 అభివృద్ధి పనులు వివిధ పురోగతి దశలో కొనసాగు తున్నాయని ఇంకా 53 పనులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని రూ 20కోట్లతో చేపట్టిన 63 పనులు టెండర్ దశలో ఉన్నాయని రూ 12 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే 50 పనులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆయా అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంకా టెండర్ పూర్తి కానీ పనులను త్వరితగతిన టెండర్ ప్రక్రియను పూర్తి చేసి ఆయా పనులను కూడా ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని కొన్ని డివిజన్ల లో టెండర్ పూర్తి అయినను కాంట్రాక్టర్లు పనులను చేపట్టడం లేదని పలువురు కార్పొరేటర్లు మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే ఆయా కాంట్రాక్టర్ల టెండర్లు రద్దుచేసి టెండర్ ను రీ కాల్ చేసి ఇతర కాంట్రాక్టర్ లకు కేటాయించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దేశాయిపేట నుంచి లక్ష్మీ టౌన్ షిప్ గుండా పైడిపల్లికి వెళ్ళే బ్రిడ్జి నిర్మాణం చేపట్టుటకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అలాగే శంభునిపేట ప్రాంతంలో స్లాటర్ హౌస్ ల ఏర్పాటుకు వెంటనే స్థలం కేటాయించాలని ఆర్డిఓ ను ఆదేశిస్తూ అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని బల్దియా అధికారులను మంత్రి ఆదేశించారు. వరంగల్ సర్కిల్ లో ఈ ఈ, డి ఈ స్థాయి అధికారులు పూర్తి స్థాయి లో లేనందున పనులు సక్రమంగా జరగడంలేదని పలువురు కార్పొరేటర్లు మంత్రి దృష్టికి తీసుకురాగా హనుమకొండ వరంగల్ డివిజన్ లకు సమాంతరంగా ఇంజనీరింగ్ అధికారులు, ఇతర సిబ్బంది ఉండాలని, వరంగల్ సర్కిల్ కు వెంటనే రెగ్యులర్ ఈఈ ని నియమించాలని కమిషనర్ ను ఆదేశించారు. ప్రతి డివిజన్ లో సమగ్ర పారిశుద్ధ్య నిర్వహణకు గాను ట్రాక్టర్లు స్వచ్ఛ ఆటోలు పారిశుద్ధ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని సానిటేషన్ అధికారులను మంత్రి ఆదేశించారు. తమ డివిజన్ లలో స్మశాన వాటిక లకు ప్రహరీ గోడలు, డ్రైన్ లు, సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని అదేవిధంగా డివిజన్ లలో పోల్ షిఫ్టింగ్ చేయాలని కార్పొరేటర్లు కోరగా స్పందించిన మంత్రి సంబంధిత అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా అన్ని డివిజన్లకు జెసిబి లు పంపేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదే విధంగా రూ.4 కోట్లతో పోల్స్ షిఫ్టింగ్ లకు టెండర్ పిలవడం జరిగిందని తెలిపారు. శానిటేషన్ నిర్వహణ సక్రమంగా జరగడంలేదని కార్పొరేటర్లు శానిటేషన్ సిబ్బంది సక్రమంగా రావడం లేదని మంత్రి దృష్టికి తీసుకురాగా ఐసిసిసి ద్వారా చెత్త సేకరణ,తరలింపు వాహనాలను స్ట్రీమ్ లైన్ చేయడం జరిగిందని నెల రోజుల్లో పూర్తిస్థాయిలో అందుబాటు లోకి వచ్చే అవకాశం ఉందని తదుపరి ఈ సమస్య ఉత్పన్నం కాదని మేయర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్ లకు చెందిన కార్పొరేటర్ల తో పాటు బల్దియా అదనపు కమిషనర్ చంద్రశేఖర్ కూడా సి పి ఓ అజిత్ రెడ్డి ఎస్ ఈ సత్యనారాయణ సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ , జిల్లా ఇరిగేషన్ అధికారి కిరణ్ కుమార్, ఆర్డీఓ సుమా, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లలో కేసీఆర్ చిన్న ఇల్లు కట్టలె

### కమీషన్లపై ఆశతో కాళేశ్వరం ప్రాజెక్ట్ ను కట్టారు

### రాష్ట్రంలో తాము 4 లక్షల పైగా ఇండ్లు మంజూరు చేశాం: పొంగులేటి

### మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ నుంచి 300 మంది చేరిక

### రెహమత్ నగర్‌లో నవీన్ యాదవ్‌కు మద్దతుగా పాదయాత్ర



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే ఈ ఇందిరమ్మ ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో నాలుగు లక్షల పైగా ఇండ్లు మంజూరు చేశామని ఇందులో 3 లక్షలకు పైగా ఇండ్లు వివిధ నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రెహమత్ నగర్ డివిజన్‌లోని కార్మికనగర్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం నాడు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో దాదాపు 300 మంది బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లోని పేదలకు ప్రయోజనం కలిగేలా ఇందిరమ్మ ఇండ్ల నిబంధనలను సడలించామని తెలిపారు, గత పదేళ్లుగా పేదల కోసం ఒక్క చిన్న ఇల్లు కూడా కట్టని కేసీఆర్ కమీషన్లపై ఆశతో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కట్టారని ఆరోపించారు.

**పేదలందరికీ పట్టాలిచ్చి ఇండ్లు కట్టిస్తాం..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాభివృద్ధికోసం అహర్నిశలూ కష్టపడుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గతంలో ఈ ప్రాంతంలో కాంగ్రెస్ నేత జనార్ధనరెడ్డి పేదల కోసం కృషి చేశారని గుర్తు చేశారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలోని అర్హులైన పేదలందరికీ పట్టాలిచ్చి ఇండ్లు కట్టిస్తామని ప్రకటించారు. అంతేగాక గత ప్రభుత్వ హయాం నుంచి అసంపూర్తిగా ఉండిపోయిన రెండు పడక గదుల ఇండ్లను పూర్తి చేసి పేదలకు ఇస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. రాష్ట్రంలోనూ, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు చూసి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 300 మందికి ప్రాతినిధ్యం వహిస్తున్న చేపల కృష్ణ, ఆనందరావు, ఫిలిం ఫెడరేషన్ నాయకుడు బసాడ కృష్ణ, లక్ష్మి తదితరులకు కాంగ్రెస్ కండువాలు కప్పి మంత్రి స్వాగతించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి నృత్యాలు, బాణాసంచాతో మంత్రి పొంగులేటికి స్వాగతం పలికారు.

## సీఎంను కలిసిన మైనార్టీ నేతలు



**హైదరాబాద్, మహా :** సీఎం రేవంత్‌రెడ్డిని వివిధ మైనారిటీ సంఘాల నేతలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మైనారిటీల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి వివేక్‌వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ ఎంపీ అజారుద్దీన్, ఫహీం ఖురేషి, వివిధ మైనారిటీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో వ్యవస్థాపకుల కోసం ఫౌండర్స్ లైబ్రరీ ప్రారంభం

**హైదరాబాద్ :** తాను రెగ్యులర్ సిలబస్‌తో పాటు సైకాలజీ వంటి అసలైన పుస్తకాలను చదవడం వల్లే కేవలం సంవత్సరంలోనే ఐఏఎస్ పరీక్షలో విజయం సాధించడం సులభమైందని ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్ తన అనుభవాన్ని పంచుకున్నారు. విద్యార్థులు అనుసంధానం కావడానికి ఒక ప్రత్యేక వేదికను అందించే లక్ష్యంతో బౌవర్ స్కూల్ ఆఫ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ 'ఫౌండర్స్ లైబ్రరీ' 'బి కేఫ్' లను ప్రారంభించిందని ఆయన తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరై, ఫౌండర్స్ లైబ్రరీని లాంఛనంగా ప్రారంభించారు. పుస్తక పఠనం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పుస్తక పఠనం కలిగిన ఇద్దరు వ్యక్తులు తమ ఆలోచనలు పంచుకోవడానికి అనువైన వేదికను ఫౌండర్స్ లైబ్రరీ అని తెలిపారు. హైదరాబాద్‌లోని వ్యవస్థాపకులు, ఆవిష్కర్తలు, విద్యార్థులు చదవడానికి, ఆలోచించడానికి, అనుసంధానం కావడానికి ఒక ప్రత్యేక వేదికను అందించే లక్ష్యంతో బౌవర్ స్కూల్ ఆఫ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ 'ఫౌండర్స్ లైబ్రరీ' 'బి కేఫ్' లను ప్రారంభించించినట్లు నిర్వహకులు తెలిపారు. "ద బుక్స్ దట్ బిల్ట్ అస్" "లెర్నింగ్ బియాండ్ క్లాస్‌రూమ్స్" అనే అంశాలపై రెండు ఆసక్తికరమైన ప్యానెల్ చర్చలు జరిగాయి ఈ కార్యక్రమానికి ఐఎస్‌బి మాజీ డీన్ అజిత్ రంగనేకర్, ఐసిఎఫ్ఎఐ ముఖ్య విద్యాధికారి ప్రొఫెసర్ నాగేంద్ర, టిహబ్ సలహాదారు మహంకాళి శ్రీనివాస రావు, ఐఐఐటీహెచ్ ప్రొఫెసర్ రమేష్ లోగనాథన్ వంటి ప్రముఖులు హాజరయ్యారు.

## ముఖ్యమంత్రికి బ్యాట్ గిఫ్ట్ ఇచ్చిన చాముండేశ్వరనాథ్

**ప్రముఖుల ఆటోగ్రాఫ్ లతో వెరీ స్పెషల్**




**హైదరాబాద్, మహా:** ప్రముఖ క్రికెట్ కోచ్ చాముండేశ్వరనాథ్ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఇటీవల ఆయన బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌లో ఐసీఏ ప్రతినిధిగా ఎన్నికైనారు. ఈ సందర్భంగా ఆయన రేవంత్ రెడ్డికి మర్యాదపూర్వకంగా కలిసి.. ఓ బ్యాట్ బహుకరించారు. ఆ బ్యాట్‌పై ప్రముఖ స్టార్ క్రికెటర్ల అటోగ్రాఫ్‌లు ఉన్నాయి. అదే ఆ బ్యాట్ స్పెషాలిటీ. చాముండేశ్వరనాథ్ క్రీడా రంగంలో కీలక పదవిలో ఉండటం తెలుగు జాతికే గర్వకారణమని సీఎం రేవంత్ అన్నారు. ట్యాలెంట్ ఉన్న క్రీడాకారులను ఎంకరేజ్ చేయడంలో చాముండేశ్వరనాథ్ ముందు ఉంటారని సీఎం కొనియాడారు. దేశంలోని ప్రతీ క్రీడాకారుడిని భుజం తట్టి ధైర్యం చెప్పడంలో చాముండి తర్వాతే ఎవరైనా అంటూ.. రేవంత్ అభినందించారు. బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌లో ఐసీఏ ప్రతినిధిగా ఎన్నికైన చాముండేశ్వరనాథ్.. సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన బ్యాటును సీఎం రేవంత్‌కు చాముండేశ్వరనాథ్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్, అజారుద్దీన్, ఫహీం ఖురేషీ పాల్గొన్నారు.

మహా పత్రిక
ANN తెలుగు
గురువారం, హైదరాబాద్ | 30-10-2025




**మహా, నెట్ వర్క్:** మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షా లు దంచి కొడుతున్నాయి. దీంతో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అత్యంత భారీ వర్షా లు కురిసే అవకాశముందని వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మొంథా తుఫాను అతలాకుతలం చేసింది. లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. ఎంతో మంది వరద నీటిలో చిక్కుకున్నారు. వారి కోసం ప్రభుత్వం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది.





# మొంథా.. మొరమొర

## జడివాన ముంచేసింది.. తెలంగాణ, ఏపీలలో భారీవర్షా లు.. జలదిగ్బంధంలో వరంగల్ రైల్వేస్టేషన్



### కూలిన వీరబ్రహ్మేంద్రస్వామి నివాసం..

## అరిష్టమా?

మొంథా తుపాను నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వైఎస్ఆర్ కడప జిల్లా బ్రహ్మంగారిమఠంలో భారీ వర్షాలకు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి నివాస గృహం కుప్పకూలింది. మొంథా తుపాను ప్రభావంతో గత కొన్ని రోజులుగా బ్రహ్మంగారిమఠంలో వర్షం పడుతోంది. ఎడతెరిపి లేకుండా వర్షం కురవటంతో వీరబ్రహ్మేంద్రస్వామి నివాసం కూలిపోయింది. అయితే ఈ ఘటనపై భక్తులు మండిపడుతున్నారు. కాలజ్ఞానకర్తగా వీరబ్రహ్మేంద్రస్వామి ప్రసిద్ధి చెందారు. ఎంతో మంది భక్తులు వీరబ్రహ్మేంద్రస్వామి సమాధిని దర్శించుకోవటానికి వస్తుంటారు. అలాగే నివాస గృహాన్ని సందర్శిస్తూ ఉంటారు. ఇంతటి చారిత్రక ప్రాశిస్త్యం కలిగిన బ్రహ్మంగారి నివాస గృహాన్ని కాపాడాల్సిన అధికారులు.. ఆ విషయంలో అలసత్వం వహించారని భక్తులు మండిపడుతున్నారు. 16 శతాబ్దం నాటి వీరబ్రహ్మేంద్ర స్వామి నివాసం పట్ల అధికారులు శ్రద్ధ చూపలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థలో ఉన్నప్పుడు మరమ్మతులు చేయించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదంటున్నారు. ఈ విషయంలో బ్రహ్మంగారి వారసులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తున్నారు. రూ .కోట్లు ఖర్చుపెట్టి బ్రహ్మంగారి మఠాన్ని అభివృద్ధి చేస్తున్నామంటున్న అధికారులు.. ఈ ఘటనకు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నిస్తున్నారు.

## తెలుగు రాష్ట్రాలకు ఫ్లాష్ ఫ్లడ్స్..

### ఐఎండి హెచ్చరిక

మోంథా తుపాను ప్రభావంతో దాదాపు ఎనిమిది రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తుపాను నేపథ్యంలో తెలంగాణ, ఏపీ సహా మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో ఫ్లాష్ ఫ్లడ్ వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఏపీలో.. ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం, యానం, గుంటూరు, ప్రకాశం జిల్లాలు. తెలంగాణలో.. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, సిద్ధిపేట, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జనగాం, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, మెదక్, మేడ్చల్-మల్కాజ్గిరి, పెద్దపల్లి జిల్లాలు. మహారాష్ట్రలో.. మరత్వాడ సమీప ప్రాంతాలు, నాందేడ్, హింగోలి, పర్బణీ, బుల్దానా, అకొలా, అమరావతి, వార్ధా, యవత్మాల్, నాగపూర్ జిల్లాలు. ఈ ప్రభావానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి.



## ప్రకాశం జిల్లాలో మొంథా ఎఫెక్ట్..

### ఒంగోలులో పలు కాలనీలు జలమయం

మొంథా తుపాను ప్రభావంతో ప్రకాశం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఒంగోలులో రోడ్లపై భారీగా వర్షపు నీరు చేరింది. పలు కాలనీలు జలమయమయ్యాయి. ఎగువ కురిసిన వర్షాలకు గుండ్లకమ్మ రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు చేరింది. అధికారులు 11 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. మార్కాపురంలో తుపాను ధాటికి పలు ప్రాంతాలను వరద ముంచెత్తింది. అర్ధవీడులో పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో ఉండిపోయాయి. జోరువానలకు కంభం చెరువు జలకళను సంతరించుకుంది.



## ఏపీలో 18 లక్షల మందిపై ప్రభావం

మొంథా తుపానువల్ల జరిగిన నష్టం అంచనా ప్రక్రియను అధికారులు కొనసాగిస్తున్నారు. తుపాను వల్ల రాష్ట్రంలో ఇద్దరు మృతి చెందినట్టు అధికారులు గుర్తించారు. ప్రాథమిక అంచనా నివేదికను రెండ్రోజుల్లో అధికారులు ప్రభుత్వానికి నివేదించే అవకాశం ఉంది. అంచనాలు వచ్చాకే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదిక అందించనుంది. రాష్ట్రంలోని 304 మండలాల్లోని 1,825 గ్రామాల్లో 87 వేల హెక్టార్లలో పంటకు నష్టం జరిగింది. 59 వేలకు పైగా హెక్టార్లలో నీట మునిగిన వరి పంట, పత్తి, మొక్కజొన్న, మినుము పంటలకు నష్టం. భారీ వర్షాలతో 78,796 మంది రైతులు నష్టపోయారు. రాష్ట్రంలో మొత్తం 380 చెట్లు రహదారులపై విరిగిపడగా, అన్నింటినీ తొలిగించామని యంత్రాంగం చెప్పింది. మొత్తం ఈ తుఫాన్ వల్ల 18లక్షల మంది ఎఫెక్ట్ అయ్యారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ సహా మంత్రులంతా తుఫాన్ విషయంలో అప్రమత్తతో వ్యవహరించి ప్రాణనష్టం నివారించారు.







## పూర్తిగా జలదిగ్బంధంలో
# వరంగల్ రైల్వే స్టేషన్

పట్టాల మీదికి చేరుకున్న వర్షపు నీరు.. పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం

## పోలీసుల మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

**బెల్లంపల్లి ఏసీపి రవికుమార్**



**బెల్లంపల్లి,మహా:** అమరరులైన పోలీసు వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బెల్లంపల్లి సబ్ డివిజన్ పోలీస్ పరిధిలోని పద్మశాలి భవన్ లోబుధవారం నాడు నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించిందని బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని చేపట్టడం జరిగిందన్నారు. అమరులైన పోలీసుల సేవలను స్మరించుకుంటూ వివిధ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని 246 యూనిట్ల రక్త సేకరణను రక్తదాతల నుండి సేకరించారని పేర్కొన్నారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతూ రక్తదానం మహా ప్రాణదానంగా అత్యవసర సేవలలో ఉపయోగపడుతుందన్నారు. సంబంధిత కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ డివిజన్ పోలీస్ సిబ్బంది సంబంధిత కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ డివిజన్ పోలీసులందరూ శిబిరంలో పాల్గొని రక్తదానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమలో బెల్లం సబ్ డివిజన్ బెల్లంపల్లి సబ్ డివిజన్ పోలీస్ యంత్రాంగం, బెల్లంపల్లి చుట్టుపక్కల గ్రామాలయువకులను, ప్రజలను ప్రోత్సహించి రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను పోలీసు శాఖ విరివిగా ప్రచారం చేపట్టడం దాంతో రక్తదాతలు అధిక సంఖ్యలో రావడం జరిగింది.చుట్టుపక్కలగ్రామాల నుండి కూడా యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు.రక్తదానం చేసిన దాతలకు రెడ్ క్రాస్ సొసైటీ వారు సర్టిఫికెట్లను ప్రధానం చేయడం జరిగింది.మొత్తం సుమారుగా 246 యూనిట్ల రక్తదానం చేయడం ద్వారా చేయడం ద్వారా రామగుండం కమిషనరేట్ లోనే అత్యధికంగా రక్తదాతలను సేకరించిన ఘనత బెల్లంపల్లి సబ్ డివిజన్ కు దక్కింది. మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న రక్త దాతలు అందరికీ పోలీసు శాఖ తరపున బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో బెల్లంపల్లి వన్టౌన్ సిఐ శ్రీనివాసరావు, బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్,తాండూరు సిఐ దేవయ్య మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి ల తోపాటు సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కంది శ్రీనివాస రెడ్డిని పరామర్శించిన మాజీ కేంద్ర మంత్రి, అసెంబ్లీ ఇంచార్జీలు



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డిని, ఆయన బావమరిది కుటుంబ సభ్యులను బుధవారం మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాల చారి పరామర్శించారు. గత ఆదివారం కంది శ్రీనివాస రెడ్డి బావమరిది గడ్డం అఖిల్ రెడ్డి గుండె పోటుతో మృతిచెందడంతో బేల మండలం సిర్సన్న గ్రామంలో కంది శ్రీనివాస రెడ్డిని కలిసారు. అఖిల్ రెడ్డి చిత్ర పటం వద్ద పుష్పాంజలి ఘటించి సంతాపం ప్రకటించారు. అఖిల్ మరణం వారి కుటుంబానికి తీరని లోటని చిన్నవయసులో మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. కంది శ్రీనివాస రెడ్డి తో పాటు అఖిల్ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసారు.అటు ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్, బోథ్ అసెంబ్లీ ఇంచార్జ్ ఆడె గజేందర్, పద్మశాలి సంఘ నాయకులు, నేరడిగొండకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఏలేటి అశ్విన్ రెడ్డి తదితరులు పరామర్శించారు.



## విద్యార్థులు బ్యాంకు ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ వివరాలను సవరించుకోవాలి

**మంచిర్యాల జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి**

**మంచిర్యాల, మహా :** విద్యార్థులు బ్యాంకు ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ వివరాలను సవరించుకోవాలని మంచిర్యాల జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తమ తమ విద్యార్థుల బ్యాంకు ఖాతా, ఐ ఎఫ్ ఎస్ సి కోడ్ వివరాలను సవరించుకోవాలని అన్నారు. ఎం.టి.ఎఫ్. ప్రొసీడింగ్ లను జనరేట్ చేసి ట్రెజరీకి అప్ లోడ్ చేసినప్పుడు విద్యార్థుల ఈ పాస్ బ్యాంక్ ఖాతా, ఐ ఎఫ్ ఎస్ సి కోడ్ సరిగా లేదని చూపిస్తుందని, ఈ కారణంగా బిల్లులు ట్రెజరీకి అప్లోడ్ చేయడం సాధ్యం కావడం లేదని వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల బ్యాంకు ఖాతా, ఐ ఎఫ్ ఎస్ సి కోడ్ తనిఖీ చేసుకోవాలని, సవరించేందుకు, ఎం. టి. ఎఫ్. బిల్లులు జారీ చేయడానికి జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎఫ్ 5 లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో పూర్తి వివరాలతో జాబితా తయారుచేసి ఆయా కళాశాలల కవరింగ్ లేఖలతో సమర్పించాలని సూచించారు.

## మాస్టర్ ప్లాన్ రూపకల్పన సక్రమంగా చేపట్టాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** అమృత్ 2.0 పథకం క్రింద జి.ఐ.ఎస్. ఆధారిత మాస్టర్ ప్లాన్ రూపకల్పన సక్రమంగా చేపట్టాలని మంచిర్యాలకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.టి.సి.పి. సంయుక్త సంచాలకులు, అమృత్ 2.0 నోడల్ అధికారి అశ్విని, మంచిర్యాల డి.టి.సి.పి.ఓ. సంపత్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో మాస్టర్ ప్లాన్ రూపకల్పన అంశంపై మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, మందమర్రి మున్సిపల్ అధికారులకు మొదటి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జి ఐ ఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. నగరం ప్రస్తుత స్థితిని అర్థం చేసుకోవడానికి, 20 సంవత్సరాల వరకు భవిష్యత్తు అవసరాలు అంచనా వేయడానికి ప్రాదేశిక వివరాలను సేకరించాలని తెలిపారు. డిజిటల్ మ్యాపింగ్ లో డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి భూ వినియోగ మ్యాప్‌లు రూపొందించవచ్చని, నూతన డేటాను ప్రతిబింబించేలా జి ఐ ఎస్ ఆధారిత ప్లాన్‌లను నవీకరించవచ్చని, తద్వారా అభివృద్ధి చెందుతున్న అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. సమగ్ర ప్రణాళిక ద్వారా భవిష్యత్తు అభివృద్ధికి భూ వినియోగం, భవన నిర్మాణం, రవాణా, వివిధ రంగాల అభివృద్ధికి తోడ్పడతాయని తెలిపారు. 2051 సంవత్సరం నాటికి జనాభా మరింత పెరిగే అవకాశం ఉందని, తరగతుల వారీగా జనాభా ప్రాతిపదికన ప్రజలకు అవసరమైన ఇండ్లు, త్రాగునీరు, రహదారులు, ఇతర ప్రజా సేవలు ప్రణాళికాబద్ధంగా అందించేందుకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని తెలిపారు. ప్రతి ఇంటికి త్రాగునీటి సరఫరా, ఉద్యానవనాలు, పచ్చదనం అభివృద్ధి చేయడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడం, వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించడంలో భాగంగా ప్రజా రవాణా వ్యవస్థను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 37.67 కిలోమీటర్ల ఏరియాలో, మందమర్రి మున్సిపల్ పరిధిలో 38.98 కిలోమీటర్ల ఏరియాలో డ్రోన్, సోషియో ఎకనామిక్ సర్వే పూర్తి చేయడం జరిగిందని, ముసాయిదా మాస్టర్ ప్లాన్ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయి సర్వే, గ్రౌండ్ ట్రూతింగ్ కార్యకలాపాల సమయంలో అవసరమైన మద్దతును అందించాలని, సిబ్బంది అందరికీ గుర్తింపు కార్డులు జారీ చేయాలని, కార్యక్రమ నిర్వహణ కొరకు టిపిబివోలు, వార్డు ఆఫీసర్ లను సహాయకులుగా నియమించి బృందాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. సంబంధిత కార్యకలాపాల నిర్వహణలో మున్సిపాలిటీలో పబ్లిక్ నోటీస్ జారీ చేయాలని, సర్వే కార్యకలాపాల సమయంలో కన్సల్టెంట్ లకు అవసరమైన సహాయం అందించాలని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో రూపొందించే జి ఐ ఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సమర్ధవంతంగా తయారు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలు అప్రమత్తంగా వుండాలి



**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**యాదాద్రి భువనగిరి, మహా:** మొంథా తుఫాన్ కారణంగా జిల్లా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సూచించారు. బుధవారం చౌటుప్పల్ చెరువును అకాల వర్షాల ప్రభావం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముందస్తుగా ఎఫ్ టీ ఎల్ పరిధిలో, చెరువు చుట్టూ ఉన్న లోతట్టు ప్రాంతాలలో తిరిగి పరిశీలించారు. చెరువు నిండిన తర్వాత చుట్టూ పక్క కాలనీల్లో నీళ్లు రాకుండా ఉండేందుకు ముందస్తు చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.జిల్లాలో మొత్తం ఈ తుఫాన్ ప్రభావం ఇంకో రెండు , మూడు రోజులు ఉన్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం మొత్తం కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. జిల్లాలో పలు చోట్ల వాగులు పొంగి ప్రవహించడంతో లో లెవల్ రోడ్లు నీట మునగడంతో ప్రజలు ఎవ్వరు కూడా వాగులు దాటవద్దని హెచ్చరించారు. జిల్లాలో నిండిన చెరువులు, వాగుల్లో చేపల వేటకి వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు.తుఫాన్ ప్రభావంతో గ్రామంలో పాత ఇండ్లు నివసించే వారిని సమీపంలో సురక్షిత ప్రాంతాలకు తక్షణమే తరలించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి, సంబంధిత అధికారులు ఉన్నారు.

## తుఫాన్ కారణంగా గురువారం గ్రీవెన్స్ రద్దు

**కలెక్టర్**

**యాదాద్రి భువనగిరి, మహా :** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లో ప్రతి గురువారం ప్రజల సమస్యలను పరిష్కరించే గ్రీవెన్స్ ను రద్దు చేయడం జరిగిందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ నేడొక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లా లోని ప్రజలు భారీ వర్షాలు కురుస్తున్నందున, ప్రజలు కలెక్టరేట్ కు వచ్చి ఇబ్బందులు పడవద్దనే ఉద్దేశంతో ఈ గ్రీవెన్స్ ను రద్దు చేయడం జరిగిందని, తదుపరి వచ్చే గురువారం గ్రీవెన్స్ యధాతధంగా ఉంటుందని అన్నారు.

## నిందితులకు సంవత్సరం జైలుశిక్ష అమలు

**వలిగొండ, మహా :** వలిగొండ మండల పరిధిలోని నర్సాపురం గ్రామానికి చెందిన ఒక మహిళపై దాడి చేసి గాయపరిచారని 2019 లో వలిగొండ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై శివ నాగ ప్రసాద్ ఆధారాలతో కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసులో నిందితులుగా నర్సాపురం గ్రామానికి చెందిన కావటి మహేష్,కావటి నరేష్,కావట్టి శివ ఏనుగుల ఉప్పలయ్య జక్కుల రామకృష్ణ కావటి సుదర్శన్ వారిపై బుధవారం రామన్నపేట అదన్నపు జ్యుడీషియల్ మొదటి తరగతి పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకట్ అవినాష్ వాదనలు విన్న తర్వాత మెజిస్ట్రేట్ ఎస్ శిరీష నిందితులకు ఒక సంవత్సరం జైలు శిక్షతోపాటు 500 రూపాయల జరిమానా విధించడం జరిగింది.ఈ కేసు విజయవంతంగా పూర్తి కావడంలో సహకరించిన సిడిఓ ఏ రామాచారి పిసి 3060, వలిగొండ పోలీస్ సిబ్బందికి అభినందనలు తెలియజేశారు

## మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

**భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి**



**భువనగిరి, మహా:** మొంథా తుఫాన్ వల్ల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపట్ల నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి కోరారు పురాతన ఇళ్లలో ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని ఆయన సూచించారు. వాగులు,చెరువులు,లోతట్టు ప్రాంతాలు,కల్వర్టులు వంటి ప్రాంతాలకు ప్రజలు వెళ్ళకూడదు అని అన్నారు అత్యవసరమైతే తప్ప ఇళ్లలో నుండి ప్రజలు బయటికి రాకూడదని, ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కోరారు. రైతులు పొలాలలో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలి. విద్యుత్ స్తంభాలను గాని, వైర్లను కానీ తడిచిన చేతులతో తాకకకూడదు. నీరు నిలువ ఉన్న విద్యుత్ స్తంభాల దగ్గర నుండి వెళ్లా రాదని జాగ్రత్తగా ఉండాలని కోరారు

## మొంథా తుఫాన్ తో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



**యాదాద్రి భువనగిరి, మహా:** భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం జూమ్ మీటింగ్ ద్వారా జిల్లాలో చేపట్టాల్సిన చర్యల గురించి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అధికారులతో మాట్లాడారు.... ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లు,రెవిన్యూ,ఆర్డీవో, పోలీస్, ఇరిగేషన్, ఈ ఈ ఆర్ అండ్ బి, ఫైర్,మున్సిపల్ కమిషనర్ లు, తాసిల్దార్లు ఎంపీడీవోలు అన్ని శాఖలకు చెందిన జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా వర్షాల నేపథ్యంలో... ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...రాబోవు రెండు , మూడు రోజులు భారీ వర్షాలు ఉన్నందువలన ప్రతి గ్రామంలో ప్రజలు ఎవ్వరు కూడా అనవసరంగా బయట రావద్దని ,ప్రయాణాలు చేయవద్దని, శిదిలావస్థ ఇండ్లలో నివసించకూడదని తెలిపారు.అలా నివసించిన వారిని గుర్తించి వేరే సురక్షిత ప్రదేశాలకు తరలించాలి. మూసి పరివాహక ప్రాంతాలలో మూసి నదిలోనికి చేపలు పట్టడానికి , పశువులను కానీ ఎవ్వరిని పోనివ్వొద్దని సూచించారు.చెరువులు అలుగుల వద్దకి కూడా ఎవ్వరిని పోనివ్వకుండా చూడాలన్నారు.గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి సిబ్బంది అందరు కూడా తగు జాగ్రత్తలు తీసుకోని మీ విధులు నిర్వహించాలన్నారు.కరెంటు స్తంబాలు ట్రాన్స్ఫార్మర్స్ ముట్టుకోవద్దని పశువులను కూడా వర్షాలకు బయటకు వదలకుండా చూడాలని తెలిపారు. మీ గ్రామం పంచాయతీ సెక్రటరీ లకు చెప్పి గ్రామంలో టామ్ టామ్ వేపించి ప్రజలు ఎవ్వరు కూడా బయటకు రావద్దని అవగాహన కల్పించాలన్నారు. చెరువుల వద్దకు, కాలువల వద్దకు ఎవ్వరిని పోవద్దని సంబంధిత అధికారులకు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడువకుండా టార్పాలిన్ లు కప్పి ధాన్యం ధాన్యం తడవకుండా చూడాలన్నారు. మెడికల్ సిబ్బంది గ్రామాలలో అందుబాటులో ఉంటూ అంటూ వ్యాధులు ప్రబల కుండా తగు చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు తెలిపారు. లో లెవెల్ కాజ్ దారులు వద్ద ప్రవాహం ఎక్కువ ఉన్న ప్రదేశాలలో పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖలు టీం సమన్వయంతో ప్రజలను వాగులు చిన్న చిన్న బ్రిడ్జిలు దాట కుండా బారికేడ్ ల ను అడ్డం పెట్టి సిబ్బందిని నియమించాలన్నారు. వర్షాల వలన పిడుగులు పడే అవకాశం ఉన్నందున చెట్ల కింద ఎవ్వరు ఉండదని సూచించారు.GPOs, VRA, పంచాయతీ సెక్రటరీ లు అందరు కూడా మీ గ్రామాలలో తిరిగి ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరుగ కుండా చూడాలని, ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని తెలిపారు. శిలవస్థ భవనాల్లో ప్రజలు ఉండకుండా చూడాలని,ఆ చుట్టూ పక్కల కుడా ఎవరు వెళ్లకుండా అవగాహన పరచాలని...దగ్గర లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు తెలియ జేయాలన్నారు. ఈ జూమ్ మీటింగ్ లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


## పెండింగ్ లో పద్మావతి కాలనీ రోడ్డు విస్తరణ



**షాద్ నగర్, మహా:** షాద్ నగర్ పట్టణంలో రెండవ పెద్ద రోడ్డుగా పిలవబడుతున్న పద్మావతి కాలనీ రోడ్డు విస్తరణ చెయ్యడంతో పాటు నూతనంగా సీసీ రోడ్డు వేస్తామని ఆర్భాటంగా శంకుస్థాపన చేసిన అధికారులు సుమారు రెండు నెలలు కావస్తున్నా నిర్మాణం చేపట్టక పోవడం పట్ల ఇటు కాలనీ వాసులు, అటు వ్యాపారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈరోడ్డు షాద్ నగర్ పట్టణానికి బైపాస్ రోడ్డుగా పిలవబడుతుంది. ప్రతినిత్యం వేలాది సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. ఈ రోడ్డు నాలుగు (పద్మావతి, లక్ష్మినర్సింహా, ఆశా, మల్లికార్జున ) కాలనీలకు అనుసంధానంగా ఉంది. ఇదే రోడ్డులో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు కూడా ఉన్నాయి. దీంతో విద్యార్థులు సైతం నానా అవస్థలు పడుతున్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కోట్ల రూపాయల నిధులు విడుదల అయినట్లు చెబుతున్న అధికారులు ఈరోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం వహించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈరోడ్డు తవ్విన కారణంగా తమకు గిరాకీలు రాక దోమలు కొట్టుకుంటూ కూర్చుంటున్నామని వ్యాపారులు లబో దిబో మంటున్నారు.

## ఆడపిల్లల తల్లిదండ్రులకు అండగా ప్రభుత్వం

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్ నగర్, మహా:** ఆడపిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా నిలబడుతుందని కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలతో వారిని ఆదుకుంటుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని ఫరూక్ నగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఫరూక్ నగర్ మండలం, షాద్ నగర్ టౌన్, కేశంపేట మండలాలకు సంబంధించిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అదే విధంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ మండల తహసిల్దార్ నాగయ్య, ఎంపీడీవో బన్సీలాల్, తదితర స్థానిక నాయకులతో కలిసి చెక్కులు జారీ చేశారు. ఫరుక్ నగర్ మండలానికి సంబంధించి 54 కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు అందజేయగా, అలాగే కేశంపేట మండలానికి 21 మందికి, షాద్ నగర్ పట్టణానికి సంబంధించి మరో 50 చెక్కులు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే శంకర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ లబ్ధిదారులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద ప్రజలను అన్ని విధాల ఆదుకునేందుకు ముందుకు వెళుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడుగు బలహీన వర్గాల ప్రజలతో పాటు అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధిలో ముందుకు తీసుకు వెళ్లే విధంగా ఆర్థికంగా చేయూతను అందిస్తున్నారని తెలిపారు. పేద ప్రజలకు ఉచిత బస్సు, సబ్సిడీపై సిలిండర్, రేషన్ దుకాణాలలో సన్న బియ్యం, రైతులకు ఉచిత కరెంట్, రైతు భరోసా, రుణమాఫీ, ఇలా అన్ని విధాల అభివృద్ధి పనులు చేపడుతున్నారని తెలిపారు.

## మొంథా తుపాన్ తీవ్రత దృష్ట్యా అప్రమత్తంగా ఉండండి

**వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్**



**వలిగొండ , మహా:** భారీ వర్షాల నేపథ్యంలో ఇప్పటికే మన ఊరు చెరువులు, కుంటలు నిండుకుండాలా ఉన్నాయి. చెరువులు మత్తడి పోసే అవకాశం, వాగులు పొంగే పరిస్థితులు ఉన్నాయి. మత్తడి, వాగులు దాటే ప్రయత్నం చేయకండి. రోడ్డుపై వెళ్ళేటప్పుడు గుంతలు గమనించండి. మీరు క్షేమంగా ఉండాలి పోలీస్ ఉన్నది మీ కోసమే. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రండి. మీ రక్షణ మా బాధ్యత.అత్యవసర పరిస్థితుల్లో సమాచారం అందించండి. డయల్ 100కి ఫోన్ చెయ్యండి వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్.



## గోపరాజుపల్లి మార్కెట్ లో తడిసి ముద్దయిన ధాన్యం

**వలిగొండ, మహా :** వలిగొండ మండల పరిధిలోని గోపరాజుపల్లి వ్యవసాయ మార్కెట్లో రైతులు వరి ధాన్యాన్ని మార్కెట్లో ఓ పోసి నెల రోజులు కావస్తున్నప్పటికీ నేటి వరకు ప్రభుత్వం కొనుగోలు చేయక పోవడంతో భారీ వర్షాల నేపథ్యంలో ధాన్యం మొత్తం తడిసి ముద్దయి రైతన్నలు బుధవారం భారీ వర్షం వస్తున్నప్పటికీ మార్కెట్లో తడిసిన ధాన్యాన్ని చూస్తూ లబోదిబోమంటూ కన్నీరు పెట్టారు ప్రభుత్వం వెంటనే తడిసిన ధాన్యాన్ని వెంటనే వేగవంతంగా కొనుగోలు ప్రారంభించాలని రైతులు కోరారు





## జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా జెన్న జంగయ్య, దాసరి పాండు

**భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలోని సుందరయ్య భవనంలో జరిగిన తెలంగాణ హోల్ హమాలి వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా 17 మందితో ఎన్నుకున్నారు జిల్లా అధ్యక్షులుగా జెన్నా జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా దాసరి పాండు, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ, చంద్రయ్య, బందేల భిక్షం, సహాయ కార్యదర్శులుగా సత్తయ్య, నరసింహ స్వామి, కోశాధికారిగా భువనగిరి రమేష్ లు ఎన్నికైనారు ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నికైన దాసరి పాండు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలుహమాలి కార్మికుల సమస్యలు పరిష్కారం చేయడంలో పట్టించుకోవడం లేవని అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడం వల్ల హమాలి కార్మికులకు కార్మిక చట్టాలైన ఈఎస్ఐ పీఎఫ్ ఇన్సూరెన్స్ సౌకర్యం పెన్షన్ సౌకర్యం కల్పించడం లేదని జిల్లాలో ఉన్న ఆల్ హ మాలి కార్మికులు సమస్యలు పరిష్కారం కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని వారు అన్నారు.

## పాదయాత్రతో గూడెంగుట్టకు...



**నస్పూర్ మహా :** అనారోగ్యం తో ఉన్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆరోగ్యం కుదుటపడాలని నస్పూర్ పట్టణ కాంగ్రెస్ నాయకులు బుధవారం పట్టణం లోని రామ భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద నుండి గూడెం గుట్ట సత్యనారాయణ స్వామి ఆలయం వరకు పాదయాత్ర ప్రారంభించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా నాయకుడు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, త్వరగా కోలుకొని పూర్తి ఆరోగ్యవంతుడిగా తిరిగి ప్రజాక్షేత్రంలోకి అడుగు పెట్టాలని ,ఆయన పేరు మీద హనుమాన్ ఆలయంలో ప్రత్యేక అర్చన పూజా కార్యక్రమాలు చేపట్టి ,అనంతరం ఆలయం నుంచి గూడెం గుట్టకు పాదయాత్ర ప్రారంభించినట్లు వారు తెలిపారు .ఈ కార్యక్రమంలో,సింగిల్ విండో డైరెక్టర్ దర్ని మధు ,మాజీ యూత్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్ళ సంపత్ రెడ్డి , మాజీ ఎంపీటీసీ సభ్యులు భూపతి శ్రీనివాస్ ,మాజీ ఏం పి టి సి సభ్యులు మమత రవీందర్, మారు మల్లయ్య, రావి కిషన్, చిందం మల్లేష్, కొండ్ర లింగయ్య, వెంగళ సాగర్ లు పాల్గొన్నారు

## గుండాలలో కార్డన్ సర్చ్



**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు, ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్ ఆధ్వర్యంలో గుండాల గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ఆపరేషన్ నిర్వహించారు. గుండాల గ్రామ పరిధిలో తగిన రిజిస్ట్రేషన్ పత్రాలు లేని మొత్తం 36 బైక్‌లు, 6 ఆటోలు, 2 ట్రాక్టర్లు గుర్తించినట్టు తెలిపారు. గుండాల గ్రామ ప్రజలకు అడిషనల్ ఎస్పీ పలు విషయాలపై అవగాహన కల్పించారు. పోలీసులు ఎల్లప్పుడూ ప్రజల శ్రేయస్సుకోసమే కృషి చేస్తారని తెలిపారు.యువత ఎలాంటి చెడు వ్యసనాలకు బానిస కాకూడదని,మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. అలాగే సైబర్ క్రైమ్ గురించి ప్రజలకు వివరించారు.నేరం జరిగిన 24 గంటల లోపులో 1930 నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే, అటువంటి నేరాలను నివారించవచ్చని చెప్పారు. మాదకద్రవ్యాలు (గంజాయి, డ్రగ్స్) వంటి వాటికి అలవాటు పడకూడదని ప్రజలకు సూచించారు.ప్రతీ ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని , సెకండ్‌హ్యాండ్ వాహనాలు కొనుగోలు చేసిన వెంటనే కొన్నవారి పేరుపై రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇచ్చోడ సీఐ బండారి రాజు , ఎస్సై వి.పురుషోత్తం,గుడిహత్నూర్ ఎస్సై ఎల్. శ్రీకాంత్, నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్, సిరికొండ ఎస్సై పూజ, ఇచ్చోడ సర్కిల్ పోలీస్ సిబ్బంది , స్పెషల్ పార్టీ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# భారత్ వస్తున్న రష్యా చమురు నౌక యూటర్న్!



రష్యా చమురుపై అమెరికా ఆంక్షల నడుమ రష్యా నుంచి ముడి చమురును తీసుకుని భారత్ వస్తున్న నౌక అకస్మాత్తుగా యూటర్న్ తీసుకుంది. షిప్‌ట్రాకింగ్ డేటా ప్రకారం.. 'ఫ్యూరియా' అనే ఈ పెద్ద నౌక మంగళవారం డెన్మార్క్, జర్మనీ మధ్య మార్గం ద్వారా భారత్ వైపు వెళుతోంది. ఈ ఓడ రష్యా ప్రభుత్వ చమురు సంస్థ రోస్ నెఫ్ట్ విక్రయించిన చమురును తీసుకువెళుతోంది. రష్యా చమురు కంపెనీలు రోస్ నెఫ్ట్, లుకోయిల్‌లను అమెరికా బ్లాక్ లిస్ట్ చేసిన వారం తర్వాత ఈ యూటర్న్ సంఘటన జరిగింది. ఈ రెండు కంపెనీలపై అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ అక్టోబర్ 22న ఆంక్షలు విధిస్తూ కంపెనీలు, బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. కాగా బ్లూమ్‌బర్గ్ ప్రకారం.. ఫ్యూరియా ట్యాంకర్ అక్టోబర్ 20న రష్యాలోని బాల్టిక్ నౌకాశ్రయమైన ప్రిమోర్స్క్ నుండి సుమారు 7,30,000 బ్యారెళ్ల చమురును లోడ్ చేసుకుని బయలుదేరింది. తొలుత రిలయన్స్ ఇండస్ట్రీస్, భారత్ పెట్రోలియం ఉపయోగిస్తున్న గుజరాత్‌లోని సిక్కా పోర్ట్‌ను ఈ నౌక తన గమ్యస్థానాన్ని ప్రకటించింది. ఈ నౌక నవంబర్ మధ్యలో భారత్ చేరుకుంటుందని భావించారు. తరువాత, నౌక తన గమ్యాన్ని ఈజిప్టులోని పోర్ట్ సైద్‌కు మార్చింది. రష్యా నుండి భారత్‌కు వేగవంతమైన మార్గం సూయజ్ కాలువ గుండా ఉంటుంది. కాబట్టి నౌకలు తరచుగా సూయజ్ కాలువ గుండా వెళ్లే ముందు పోర్ట్ సైద్‌ను తమ గమ్యస్థానంగా ప్రకటిస్తుంటాయి. అయితే ఈ ఫ్యూరియా నౌక వయస్సు కూడా సమస్య కావొచ్చు. ఫ్యూరియా ట్యాంకర్‌ను ఇప్పటికే యూరోపియన్ యూనియన్, యూకే నిషేధించాయి. ఈ ట్యాంకర్‌కు ఈ ఏడాది 23 ఏళ్లు నిండుతాయి. చమురు ట్యాంకర్ల సాధారణ పరిమితి 18 సంవత్సరాలు. అంతేకాకుండా డెన్మార్క్‌తో సహా కొన్ని యూరోపియన్ దేశాలు ఇప్పుడు తమ జలాల గుండా వెళుతున్న పాత ట్యాంకర్ల తనిఖీలను ముమ్మరం చేశాయి.



# మెటల్ షేర్ల మెరుపులు

## లాభాల్లో ముగిసిన స్టాక్‌మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. ఫెడరల్ రిజర్వ్ విధాన నిర్ణయానికి ముందు సానుకూల ప్రపంచ సంకేతాలు, ఆశావాదం మధ్య భారత ఈక్విటీ బెంచ్ మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ ఎగిశాయి. అంతేకాకుండా అమెరికా అధ్యక్షుడు త్వరలో భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేస్తారనే వార్తలు కూడా మదుపరుల సెంటిమెంట్‌ను పెంచాయి. ఈరోజు బీఎస్ఈ సెన్సెక్స్ 368.97 పాయింట్లు లేదా 0.44 శాతం పెరిగి 84,977.13 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 117.7 పాయింట్లు లేదా 0.45 శాతం లాభపడి 26,053.9 పాయింట్ల వద్ద స్థిరపడింది. విస్తృత మార్కెట్లో ఎన్ఎస్ఈ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 0.64 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ 0.43 శాతం లాభపడ్డాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ ఆటో మినహా మిగతా అన్ని రంగాల సూచీలు ప్రతికూలంగా స్థిరపడ్డాయి. నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ 2.12 శాతం లాభపడగా, ఎనర్జీ, మెటల్, మీడియా, బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐటీ, ఫార్మా, ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. సెన్సెక్స్ లో ఎన్టీపీసీ, పవర్ గ్రిడ్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్, టాటా స్టీల్ టాప్ గెయినర్లుగా నిలిచాయి. భారత్ ఎలక్ట్రానిక్స్, ఎటర్నల్, మహీంద్రా & మహీంద్రా, మారుతి సుజుకీ, బజాజ్ ఫైనాన్స్ వెనుకబడినవాటిలో అగ్రస్థానంలో ఉన్నాయి.

# అదానీ గ్రూప్ షేర్లదే అదృష్టం!



అదానీ గ్రూపు సంస్థల షేర్లు మెరుపులు మెరిపించాయి. ఒక్కరోజులో దాదాపు రూ.40వేల కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను పెంచుకున్నాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్ నాయకత్వంలోని కీలక గ్రూప్ కంపెనీల బలమైన త్రైమాసిక ఫలితాలు మదుపరుల ఉత్సాహాన్ని పెంచాయి. పునరుత్పాదక, ఇంధన రంగాల ఫ్లాగ్‌షిప్ సంస్థల ప్రదర్శనతో ప్రేరణ పొందిన ఈ ర్యాలీ, గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీల్లో విస్తృత స్థాయి పెరుగుదలకు దారి తీసింది. అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఒక్కరోజులో రూ.14,521 కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ పెరుగుదలకను సాధించింది. బీఎస్ఈలో కంపెనీ షేర్లు 14% పెరిగి రూ.1,145 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకి, రూ.1,113.05 వద్ద ముగిశాయి. సెప్టెంబర్ త్రైమాసికంలో కంపెనీ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 111% పెరిగి రూ.583 కోట్లకు చేరుకోగా, మొత్తం ఆదాయం 4% తగ్గి రూ.3,249 కోట్లుగా నమోదైంది. అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ (ఫ్రాన్స్‌కు చెందిన టోటల్ ఎనర్జీస్‌తో జాయింట్ వెంచర్) షేర్లు 8.7% పెరిగి రూ.675 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకి, రూ.634.50 వద్ద ముగిశాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ ఒక్క రోజులో రూ.1,468 కోట్ల మేర పెరిగింది. ఇక ఈ కంపెనీ త్రైమాసిక నికర లాభం ఏడాది ప్రాతిపదికన 9% తగ్గినప్పటికీ, ఇన్‌పుట్ గ్యాస్ ఖర్చులు 26% పెరగడం వల్ల వచ్చిన ఒత్తిడిని మార్కెట్ పెద్దగా పట్టించుకోలేదు. పునరుత్పాదక, గ్యాస్ వ్యాపారాల బాటలోనే ఇతర అదానీ గ్రూప్ కంపెనీలు కూడా ర్యాలీలో భాగమయ్యాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు 2% పెరిగి, మార్కెట్ విలువలో రూ.5,592 కోట్లు జోడించింది. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ స్టాక్ 3 శాతం పెరగడంతో రూ.8,500 కోట్ల విలువ జతకలిసింది. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 5% పెరిగి రూ.5,592 కోట్ల విలువను చేర్చుకుంది. ఇక అంబుజా సిమెంట్స్ రూ.4,041 కోట్లు, ఏసీసీ లిమిటెడ్ రూ.261 కోట్లు, అదానీ విల్మార్ రూ.936 కోట్లు, ఎన్డీటీవీ రూ.33 కోట్లు, సంఘి ఇండస్ట్రీస్ రూ.32 కోట్లు మార్కెట్ విలువ పెరుగుదల నమోదు చేశాయి. మొత్తం మీద, బుధవారం ఒక్క రోజులో అదానీ గ్రూప్ మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.39,640 కోట్ల మేర పెరిగింది.

# ఆ భయంతోనే ఇంకా పేదలవుతున్నారు


ధనిక, పేద, మధ్యతరగతి మధ్య తేడా అదే..

'రిచ్ డాడ్ పూర్ డాడ్' రచయిత రాబర్ట్ కియోసాకి మరోసారి బిట్‌కాయిన్‌పై తన విశ్వాసాన్ని 'రెట్టింపు' చేశారు. క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్ విలువ ఈ ఏడాది రెట్టింపు అవుతుందని, బహుశా 2 లక్షల డాలర్లకు చేరవచ్చని అంచనా వేశారు. అలాగే ఎందుకు చాలామంది నష్టాల్లోనే మిగిలిపోతున్నారన్నది కూడా వివరించారు. రాబర్ట్ కియోసాకి బిట్ తాజాగా 'ఎక్స్'(గతంలో ట్విట్టర్)లో మరో ఆసక్తికర పోస్ట్ చేశారు. 'బిట్ కాయిన్ ధర ఈ సంవత్సరం రెట్టింపు కావచ్చు.. బహుశా 2 లక్షల డాలర్లకు చేరవచ్చు', 'నష్టపోతున్నవారు నష్టపోతూనే ఉంటారు ఎందుకంటే వారిలో ఎమోషనల్ ఇంటెలిజెన్స్ లేదా "ఈక్యూ" లోపించింది' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన మిత్రునితో జరిగిన వ్యక్తిగత అనుభవాన్ని కియోసాకి పంచుకున్నారు. కొన్నేళ్ల క్రితం ఓసారి తన స్నేహితుడికి తన కాయిన్ బేస్ యాప్‌ను చూపించానని, అదప్పుడు అంత మెరుగ్గా లేదని రాసుకొచ్చారు. కానీ ఇప్పుడు ఆ అకౌంట్‌లో లక్షల బిట్ కాయిన్లు ఉన్నాయని వివరించారు. అయితే అతనప్పుడు చూడగలిగింది వేలల్లో నష్టాలనే.. కానీ మిలియన్లలో లాభాలను అతను చూడలేకపోయాడని తాను గుర్తించినట్లు రాసుకొచ్చారు.

'ఆ మానసిక భావోద్వేగ వ్యత్యాసమే ధనిక, పేద, మధ్యతరగతి మధ్య కీలకమైన వ్యత్యాసం' అని కియోసాకి పేర్కొన్నారు. "దీనినే ఈక్యూ లేదా ఎమోషనల్ ఇంటెలిజెన్స్ అంటారు" అని వివరాంచారు. కియోసాకి అభిప్రాయం ప్రకారం.. "పేదలకు తక్కువ ఈక్యూ ఉంటుంది. వారు భయం అనే భావోద్వేగంలో ఉంటున్నారు". అదే "ధనవంతులకు 'భయం', ఆశ' రెండింటి గురించీ తెలుసు. ఈ రెండు ఈక్యూలు మనందరికీ ఉండేవే. సంపన్నులు, విజేతలు ఈ రెండు ఈక్యూలను గౌరవిస్తారు". "ఈక్యూ.. ఐక్యూ కంటే శక్తివంతమైనది. అందుకే నా 'పూర్ డాడ్' వంటి చాలా మంది ఉన్నత విద్యావంతులు కూడా పేదలుగానే గతిస్తున్నారు" అని కియోసాకి ఉదహరించారు. "ఆర్థిక ప్రపంచంలో ఎమోషనల్ ఇంటెలిజెన్స్ అనేది ఐక్యూ కంటే ముఖ్యమైనది" అన్నారు. యు.ఎస్. ఫెడరల్ రిజర్వ్ విధాన నిర్ణయం, యూఎస్‌చైనా వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితికి ముందు లిక్విడేషన్ల ద్వారా స్వల్పకాలిక అస్థిరతతో బిట్ కాయిన్ విలువ బుధవారం (అక్టోబర్ 29) 1,13,125 డాలర్ల వద్ద కదులుతున్న నేపథ్యంలో కియోసాకి నుంయి ఈ బుల్లిష్ వ్యాఖ్యలు వచ్చాయి.

# ఉపాధిలో సేవల రంగం వాటా 30 శాతం


ఉపాధి కల్పనలో సేవల రంగం 30 శాతంతో కీలక పాత్ర పోషిస్తున్నట్టు నీతి ఆయోగ్ నివేదిక తెలిపింది. అయితే అంతర్జాతీయ సగటు 50 శాతం కంటే తక్కువేనని, నిర్మాణాత్మక పరివర్తన నిదానంగా కొనసాగుతుండడం ఇందుకు కారణమని పేర్కొంది. నిర్మాణాత్మక సంస్కరణలు, సామాజిక భద్రతను వేగవంతం చేయడం, అసంఘటిత రంగ కార్మికుల నమోదును డిజిటైజ్ చేయడం, సంరక్షణ చర్యల ద్వారా సేవల రంగంలో ఉపాధి కల్పనను మరింత పెంచొచ్చని సూచించింది. 2011-12 నాటికి ఉపాధి కల్పనలో సేవల రంగం వాటా 26.9 శాతం ఉంటే, 2023-24 నాటికి 29.7 శాతానికి పెరిగినట్టు నీతి ఆయోగ్ తెలిపింది. ముఖ్యంగా గడిచిన ఆరేళ్లలో ఈ రంగంలో 4 కోట్ల ఉపాధి అవకాశాలు ఏర్పడినట్టు తాజా నివేదికలో పేర్కొంది. దేశ ఉపాధి కల్పన వృద్ధికి సేవల రంగం కీలకంగా నిలుస్తున్నట్టు తెలిపింది. ముఖ్యంగా దేశ ఉత్పాదకతలో సేవలు సగం వాటా పోషిస్తుంటే, ఉపాధి కల్పన పరంగా మూడింట ఒక వంతులోపే ఉండడాన్ని నీతి ఆయోగ్ ప్రస్తావించింది. అది కూడా ఎక్కువ మంది అసంఘటిత రంగంలో, తక్కువ వేతనాలకు పనిచేస్తున్నట్టు తెలిపింది. వృద్ధికి, ఉపాధి కల్పనకు మధ్య అంతరం దేశ సేవల ఆధారత అభివృద్ధికి సవాలుగా నిలుస్తున్నట్టు పేర్కొంది. సేవల రంగంలో ఉపాధి పరంగానూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య నెలకొన్న అంతరాన్ని నీతి ఆయోగ్ నివేదిక ఎత్తి చూపింది. పట్టణాల్లో 60 శాతం మంది ఉపాధి పొందుతుంటే, పల్లెల్లో ఇది 20 శాతంగా ఉన్నట్టు తెలిపింది. స్త్రీ-పురుషుల పరంగానూ అంతరం నెలకొందని.. గ్రామీణ మహిళలు 10.5 శాతం మంది సేవల రంగంలో పనిచేస్తుంటే, పట్టణాల్లో 60 శాతంగా ఉన్నట్టు వెల్లడించింది. సేవల రంగంలో ఉద్యోగాల నాణ్యతకు, విద్యార్హతలకు మధ్య అంతరం అధికంగా ఉంటోందని.. ఈ రంగం అవసరాలకు తగ్గట్టు నైపుణ్యాల కల్పన అవసరమని సూచించింది. పెద్ద రాష్ట్రాల్లో రిటైల్ షాపులు, రవాణా సేవలు ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. అయినప్పటికీ ఉత్పాదకత తక్కువగా ఉంటోంది. ఐటీ, ఫైనాన్స్, నిపుణుల సేవలకు దక్షిణాది, పశ్చిమాది రాష్ట్రాలు కేంద్రంగా ఉంటున్నాయి. మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ అధిక ఉత్పాదకతతో పటిష్టమైన సేవల కేంద్రాలను ఏర్పాటు చేసుకోగలిగినట్టు నీతి ఆయోగ్ నివేదిక తెలిపింది. బీహార్, మధ్యప్రదేశ్ ఇతర రాష్ట్రాలు తక్కువ విలువ కలిగిన సంప్రదాయ సేవల విభాగాలపై ఆధారపడినట్టు పేర్కొంది.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL





# కోట్లు కుమ్మరించారు.. ఢిల్లీలో వర్షం కురవలేదు



**ఢిల్లీ:** ఢిల్లీలో క్లౌడ్ సీడింగ్‌కు బ్రేక్ పడింది. కాలుష్య రాజధానిగా మారిన ఢిల్లీలో వాయు కాలుష్య భూతాన్ని తరిమికొట్టాలని రేఖా గుప్తా సారథ్యంలోని ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన క్లౌడ్ సీడింగ్ ఫెయిల్ అయ్యింది. మేఘాలను చల్లబరిచి వర్షింపజేసే రసాయనాలను చల్లే విమానాలను రంగంలోకి దింపింది. ఐఐటీ-కాన్పూర్ సహకారం, సమన్వయంతో నిన్న (అక్టోబర్ 28, మంగళవారం)రాజధానిలో మేఘావృత గగనతలంలో మేఘమథన క్రతువుకు శ్రీకారం చుట్టింది. మరికొన్ని రోజుల పాటు ఈ విమానాలు రసాయనాలను వెదజల్లే ప్రక్రియ కొనసాగుతుందని కూడా ప్రభుత్వం వెల్లడించింది. అయితే, మేఘాల్లో తగినంత తేమ లేకపోవడంతో వర్షం కురవలేదు. దీంతో ఈ ప్రక్రియను రాష్ట ప్రభుత్వం నిలిపివేసింది. ఢిల్లీలో కాలుష్య నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తోంది. వర్షించని మేఘాల నుంచి చినుకులు కురిసేలా చేసే ఈ ప్రక్రియను సాధారణంగా క్లౌడ్-సీడింగ్ అంటారు. ఇందుకోసం ప్రభుత్వం సుమారు రూ.3.21 కోట్లు కేటాయించింది. అయితే, ఇది వాయు కాలుష్యానికి తాత్కాలిక ఉపశమనంగా పనిచేస్తుందని, ఖరీదైన ఈ ప్రక్రియను శాశ్వత పరిష్కారంగా భావించకూడదని పలువురు పర్యావరణవేత్తలు అంటున్నారు. ఐఐటీ కాన్పూర్ డైరెక్టర్ మనీంద్ర అగర్వాల్ ఇవాళ(బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. క్లౌడ్ సీడింగ్ ప్రయోగం ద్వారా కృత్రిమ వర్షం రాలేదు కానీ భవిష్యత్తు ప్రయత్నాలకు ముఖ్యమైన సమాచారం లభించిందని తెలిపారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన 15 మానిటరింగ్ స్టేషన్ల ద్వారా సేకరించిన డేటా ప్రకారం, PM 2.5, PM 10 మలినాల స్థాయిల్లో 6-10 శాతం తగ్గుదల కనిపించిందని ఆయన చెప్పారు. కాగా, ఢిల్లీ స్థానిక ప్రాంతాలను కృత్రిమ వర్షాలతో తడిసి ముద్దచేసేందుకు ప్రత్యేక విమానాలు మంగళవారం (అక్టోబర్ 28) కాన్పూర్ నుంచి బయల్దేరాయి. ఢిల్లీలోని బురారీ, నార్త్ కరోల్ బాగ్, మయూర్ విహార్ వంటి ప్రాంతాల మీది మేఘాలపై ఈ విమానాలు సిల్వర్ అయోడైడ్, సోడియం క్లోరైడ్ మిశ్రమాలను చల్లాయి. దాదాపు 20 శాతం తేమ ఉన్న మేఘాలను కృత్రిమ వర్షాల కోసం ఎంపిక చేశారు. సెస్నా రకం విమానం ఒక్కోటి 2-2.5 కేజీల బరువైన రసాయన మిశ్రమాన్ని వేర్వేరు చోట్ల వెదజల్లింది. దాదాపు 8 ప్రాంతాల్లో క్లౌడ్-సీడింగ్‌ను చేపట్టారు.

# కోల్‌కత్తా పార్క్ స్ట్రీట్ రేప్ కేసు దోషి : మరో అఘాయిత్యం



2012లో కోల్‌కత్తాలోని పార్క్ స్ట్రీట్‌లోని ఒక నైట్ క్లబ్‌లో స్నేహితులతో కదులు తున్న కారులో ఒక మహిళపై సామూహిక అత్యాచారచేసిన శిక్ష అనుభవించిన నాజర్ ఖాన్ మరో అఘాయిత్యానికి తెగబడ్డాడు. కోల్‌కత్తాలో ఒక ఫైవ్ స్టార్ హోటల్‌లో ఒక మహిళను లైంగికంగా వేధించాడు. గాజు సీసాలతో దాడి చేశాడు. సంచలనం రేపిన పార్క్ స్ట్రీట్ గ్యాంగ్ రేప్ కేసులో దోషిగా తేలిన 35 ఏళ్ల నాజర్ ప్రెసిడెన్సీ జైలు నుండి బయటకు వచ్చాడు. మంచి ప్రవర్తన కారణంగా ఏడాది ముందే జైలు విడుదలైన అతగాడు ఏమీ మారలేదు సరికదా, మరోసారి తన దుర్మార్గ వైఖరిని చాటుకున్నాడు. కోల్‌కత్తాలోని పార్క్ స్ట్రీట్‌లోని 5స్టార్ హోటల్‌లో మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. తన భర్త, స్నేహితులతో ఉండగా, ఆమెను వేధించడంతోపాటు, గాజుసీసాలతో వారిపై దాడికి పాల్పడ్డాడు. బిధాన్‌నగర్‌లోని హయత్ రీజెన్సీలోని ప్లే బాయ్ క్లబ్‌లో ఆదివారం తెల్లవారుజామున 4.15 గంటల ప్రాంతం ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈకేసులో ఉన్న నిందితులతోపాటు 2012 పార్క్ స్ట్రీట్ గ్యాంగ్ రేప్ కేసులో దోషిగా తేలిన నాజర్ ఖాన్ ఉన్నాడు. మరో నిందితుడు నాజర్ మేనల్లుడు జునైద్ ఖాన్. ఈ ఘటనలో ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదు. క్లబ్‌లో తాను, తన భర్త, సోదరుడు, ఇతర స్నేహితులతో కూర్చుని ఉండగా నిందితులు గలాటా చేశారని ఆ మహిళ తన ఫిర్యాదులో పేర్కొంది. నాజర్, జునైద్ ఇంకా వారి స్నేహితులు తమపై దాడి చేసి, తనను అనుచితంగా తాకడానికి ప్రయత్నించారని ఆ మహిళ ఆరోపించింది. సోదరుడు తనను రక్షించడానికి ప్రయత్నించినప్పుడు, గాజు సీసాలు విసిరారని పేర్కొంది. హోటల్ నుంచి పారిపోవడానికి ప్రయత్నించి నప్పటికీ వారు వదల్లేదనీ, జునైద్ ఖాన్ దాదాపు 20 మందికి ఫోన్ చేసి తమపై దాడి చేశాడని, ఫోన్‌లో చంపుతామని కూడా బెదిరించారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. రెస్టారెంట్ క్లబ్ CCTVలో ఈ దాడికి సంబంధించిన మొత్తం వీడియోను మీరు చూడవచ్చన్నారు ఆమె. కాగా 2012 ఫిబ్రవరిలో నగరం నడిబొడ్డున ఉన్న పార్క్ స్ట్రీట్‌లోని ఒక నైట్ క్లబ్ ముందు 40 ఏళ్ల మహిళను కారులో తీసుకెళ్లి, కదులుతున్న కారులోనే సామూహిక అత్యాచారం చేసి, రోడ్డు క్రాసింగ్ దగ్గర విసిరేసి వెళ్లిపోయారు. ఈ కేసులో దోషిగా తేలిన ఐదుగురు వ్యక్తులలో నాజర్ కూడా ఉన్నాడు. పదేళ్ల శిక్షాకాలం ముగియడానికి ఒక సంవత్సరం కంటే ముందే 2020లో జైలు నుండి విడుదలయ్యాడు.

# మీ కోసం సీఎం, పీఎం పోస్టులు ఖాళీగా లేవు



**పట్నా:** బిహార్ ఎన్నికల సమయం సమీపిస్తున్న వేళ.. ఎన్డీఏ కూటమి, మహా కూటమిల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. బిహార్‌లో ఓట్ల కోసం ప్రధాని నరేంద్ర మోదీ.. డ్యాన్స్ చేస్తారంటూ ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ విమర్శలు చేయగా, దానికి బీజేపీ స్ట్రాంగ్‌గానే కౌంటర్ ఇచ్చింది. ఇవి సీఎం, పీఎం పోస్టులు అని, అవేమీ మీ కోసం ఖాళీగా లేవని కేంద్ర హోంశాఖ మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా ధ్వజమెత్తారు. ఈ రోజు(బుధవారం, అక్టోబర్ 29వ తేదీ) దార్‌భంగాలో ఎన్నికల ర్యాలీ చేపట్టిన అమిత్ షా.. కాంగ్రెస్ నేతృత్వంలోని మహా కూటమిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అసలు కాంగ్రెస్‌లో కానీ ఆర్జేడీలో కానీ వెవరైనా యువ కాంగ్రెస్ నేతలకు టికెట్లు ఇచ్చారా? అని అమిత్ షా ప్రశ్నించారు. తమ ఎన్డీఏ కూటమి మాత్రం యువ నేతల్ని ప్రోత్సహించే క్రమంలో చాలా మందికి టికెట్లు ఇచ్చిందన్నారు. 'ఒకరేమో(లాలూజీ) తన కుమారుడిని సీఎం చేయాలనుకుంటున్నారు.. మరొకరు(సోనియా జీ) తన తనయుడు రాహుల్ గాంధీని దేశానికి పీఎం చేయాలని అనుకుంటున్నారు. ఇవేమైనా ఖాళీగా ఉన్న పదవులా.. వచ్చి కూర్చోవడానికి. మీ కుమారుల కోసం అవేమీ ఖాళీగా లేవు' అని అమిత్ షా ధ్వజమెత్తారు. బిహార్‌లో ఏర్పడ్డ మహాఘట్‌బంధన్( మహా కూటమి) కాదని, అదొక దొంగల కూటమి అంటూ అమిత్ షా విమర్శలు గుప్పించారు. 'జన్నాయక్ కర్పూరి ఠాకూర్‌కు మోదీ జీ భారతరత్న ప్రదానం చేశారు. ఇప్పుడు, వారు (ప్రతిపక్షాలు) కర్పూరి జీ నుండి ఆ బిరుదును తీసివేయాలనుకుంటున్నారు. అది ఎప్పటికీ జరగదు. బాబు జగ్జీవన్ రామ్‌ను ప్రధానమంత్రి కాకుండా చేసిన కాంగ్రెస్ నిజ స్వరూపాన్ని ప్రజలు చూశారు' అని తనదైన శైలిలో మహా కూటమిపై విరుచుకుపడ్డారు.

# అద్వానీ రథయాత్రను అడ్డుకున్న పాపం వారిదే: యోగి




అద్వానీ రథయాత్రను అడ్డుకున్నారంటూ ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌పై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆరోపించారు. 1990లో సమస్తిపుర్‌లో జరిగిన ఘటనను గుర్తు చేస్తూ.. ఆ చర్యను 'పాపం'గా అభివర్ణించారు. ఇవాళ బుధవారం(అక్టోబర్ 29) బిహార్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న యోగి.. సివాన్, భోజ్‌పూర్, బక్సర్ జిల్లాల్లో మూడు ప్రచార సభల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్, ఆర్జేడీలపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

రామ మందిర నిర్మాణం.. దేశంపై 500 ఏళ్ల మచ్చను తొలగించిందని యోగి అన్నారు. ఆర్జేడీ మిత్రపక్షమైన కాంగ్రెస్.. రాముడు లేడని చెబుతోందంటూ.. 2007లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సమర్పించిన అఫిడవిట్‌ను ఆయన ఉదాహరించారు. ఆర్జేడీ అభ్యర్థి ఒసామా షహాబ్ గురించి మాట్లాడుతూ.. ఆయన తండ్రి మొహమ్మద్ షహాబుద్దీన్ దేశవ్యాప్తంగా భయంకర గ్యాంగ్‌స్టర్‌గా పేరుగాంచిన వ్యక్తి అంటూ యోగి ఆరోపించారు. ఆర్జేడీ మళ్లీ 'జంగిల్ రాజ్'ను తీసుకురావాలని చూస్తోందంటూ విమర్శలు గుప్పించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి, భద్రతకు కట్టుబడి ఉంది. ఎన్డీఏ ప్రభుత్వం కార్పూరీ ఠాకూర్, జగ్జీవన్ రామ్, రాజేంద్ర ప్రసాద్, జయప్రకాశ్ నారాయణ సిద్ధాంతాలపై పనిచేస్తోంది. సీతామఢి జిల్లాలో సీతాదేవి ఆలయ నిర్మాణానికి ఆర్జేడీ వ్యతిరేకంగా ఉందని ఆరోపించారు. అయోధ్య ధామ్ నుంచి సీతామఢి వరకు రూ. 6,100 కోట్లతో కనెక్టివిటీ పనులు జరుగుతున్నాయని యోగి తెలిపారు.

మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | గురువారం, హైదరాబాద్ | 30-10-2025



# ఆ రెండు సినిమాలు చేసి ఇక విశ్రాంతి?

సూపర్‌స్టార్ రజనీకాంత్ షాకింగ్ నిర్ణయం తీసుకోబోతున్నారా? అంటే తమిళ మీడియాలో అవుననే సమాధానం వినిపిస్తుంది. ప్రస్తుతం ఈయన 'జైలర్ 2' చేస్తున్నారు. ఇది కాకుండా మరో రెండు ప్రాజెక్టులు లైన్‌లో ఉన్నాయని, వీటిని పూర్తి చేసిన తర్వాత రిటైర్మెంట్ తీసుకుంటారనే టాక్ గట్టిగా వినిపిస్తుంది. మరి ఇందులో నిజమెంత? అనేది ఇప్పుడు చూద్దాం.

చెప్పాలంటే ఈ పాటికే రజనీకాంత్ రిటైర్మెంట్ ఇచ్చేసేవారేమో! ఎందుకంటే 2010లో 'రోబో' చేసిన తర్వాత సినిమాలైతే చేస్తూ వచ్చారు గానీ ఒక్కటంటే ఒక్కటి కూడా హిట్ కాలేదు. మధ్యలో 'రోబో 2.0' కొంతమేర పర్వాలేదనిపించింది. అయితే 'జైలర్' బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకోవడం ఈయనకు సరికొత్త ఉత్సాహాన్ని ఇచ్చినట్లుంది. దీంతో లాల్ సలాన్, వేట్టయాన్ చిత్రాలు చేశారు. కానీ ఇవి ఫ్లాప్ అయ్యాయి. ఈ ఏడాది 'కూలీ'తో ఏకంగా రూ.1000 కోట్ల మార్క్ కొట్టేస్తారని రిలీజ్‌కి ముందు అందరికీ అనిపించింది. కానీ రూ.500 కోట్ల దగ్గరకు వచ్చి ఆగిపోయింది.

ప్రస్తుతానికైతే నెల్సన్ దర్శకత్వంలో రజనీ.. 'జైలర్ 2' చేస్తున్నారు. ఇది పూర్తయిన తర్వాత కమల్ హాసన్‌తో మల్టీస్టారర్ చేయబోతున్నారు. ఈ చిత్రం త్వరలో మొదలు కానుంది. అయితే ఈ మూవీకి కూడా నెల్సన్ దర్శకత్వం వహిస్తారని తెలుస్తోంది. దీనితో పాటు సుందర్.సి దర్శకత్వంలోనూ రజనీ ఓ సినిమా చేయబోతున్నారని సమాచారం. ఈ రెండు ప్రాజెక్టులు అయిపోయిన తర్వతా రజనీ.. రిటైర్మెంట్ ఇచ్చేస్తారట. ప్రస్తుతానికి ఈ రూమర్స్‌పై అధికారిక సమాచారం లేనప్పటికీ దాదాపు ఇదే కన్ఫర్మ్ అని ఆయన సన్నిహితులు అంటున్నారు.

# తట్టుకోలేకపోయా!

దక్షిణాది చిత్ర పరిశ్రమలో కథానాయికగా మంచి గుర్తింపు తెచ్చుకుంది హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్. ఈ బ్యూటీ హీరోయిన్‌గా తన పదేళ్ల ప్రయాణాన్ని పూర్తిచేసుకుంది. 2015లో ప్రేమమ్ అనే మలయాళం చిత్రం ద్వారా హీరోయిన్‌గా పరిచయమైంది. ఆ తర్వాత తమిళం, తెలుగు భాషల్లో ఎంట్రీ ఇచ్చి ఈ రెండు భాషల్లోనూ మంచి అవకాశాలు పొందుతూ పేరు తెచ్చుకుంది. మొదట్లో పక్కింటి అమ్మాయి ఇమేజ్‌ను సంపాదించుకున్న ఈమె ఇటీవల కొన్ని చిత్రాల్లో మితిమీరిన అందాలారబోత, లిప్‌లాక్ సన్నివేశాల్లో నటించి విమర్శలను ఎదుర్కొంది.


## రెండు ఫ్లాప్స్.. వెంటనే సక్సెస్

ఇకపోతే జయాపజయాలు ఎవరికైనా సహజమే. ఈ అమ్మడు కూడా కొన్ని అపజయాలను చవిచూసింది. ముఖ్యంగా ఆ మధ్య తమిళంలో రవిమోహన్‌కు జంటగా నటించిన సైరన్, ఇటీవల తెలుగులో నటించిన పరదా చిత్రాలు అనుపమపరమేశ్వరన్‌ను తీవ్ర నిరాశకు గురిచేశాయి. అలాంటిది తాజాగా ఈమె నటించిన తెలుగుచిత్రం కిష్కింధపురి సక్సెస్ అందుకుంది. అదేవిధంగా తమిళంలో నటించిన బైసన్ విజయం ఈమెకు మంచి ఉత్సాహాన్ని ఇచ్చింది అనే చెప్పాలి. ఇందులో అనుపమ పరమేశ్వరన్ పాత్ర పరిమితమే అయినా, ఉన్నంతవరకు ఆ పాత్రకు న్యాయం చేసిందంటూ ప్రశంసలు అందుకుంటోంది.

## యాక్టింగే రాదన్నారు

అలా మళ్లీ హిట్‌ట్రాక్‌లో పడ్డ ఈ బ్యూటీ ప్రస్తుతం లాక్‌డౌన్ అనే తమిళ చిత్రంలో నటిస్తోంది. ఈసందర్భంగా ఒక ఇంటర్వ్యూలో అనుపవమా పరమేశ్వరన్ మాట్లాడుతూ.. తన తొలిచిత్రం ప్రేమమ్ విడుదల తర్వాత తనపై జరిగిన ట్రోలింగ్స్‌తో చాలా భయపడ్డానంది. ముఖ్యంగా తనకు నటనే రాదని మలయాళ చిత్ర పరిశ్రమలో విమర్శించారంది. అయినా తనకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపింది. ఇప్పుడు తనను చూసి తానే గర్వపడుతున్నానని పేర్కొంది. నట జీవితంలో ఒక కొత్త చాప్టర్‌లో ప్రవేశించినట్లు చెప్పకొచ్చింది.






# రక్తంతో తడిసిన చేయి..


'హనుమాన్' తర్వాత ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి వరుస ప్రాజెక్టులను ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో ఒకటి 'మహాకాళి' . ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ స్టోరీ , స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. దర్శకురాలు పూజ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఇందులో భాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా కీలక పాత్ర పోషిస్తున్నాడు. త్వరలోనే ఈ చిత్రం నుంచి మరో అప్‌డేట్ రాబోతుంది. అక్టోబర్ 30న ఉదయం 10:08 గంటలకు 'మహాకాళి' నుంచి ఏదో పవర్‌ఫుల్ అప్‌డేట్ రిలీజ్ చేయనున్నట్లు టీమ్ ప్రకటించింది. ఈ అనౌన్స్‌మెంట్‌తో పాటు రిలీజ్ చేసిన పోస్టర్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ఇందులో రక్తంతో తడిసిన ఓ చేయి, దానికి నిండుగా బంగారు గాజులు ఉన్నాయి. నల్లటి నేలపై ఒక ఆయుధం పట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు చూపించారు. ఆ పోస్టర్‌పై అంతం లేని వినాశన జ్వాల మేల్కొంది అనే క్యాప్షన్ ఇచ్చారు. ఈ పోస్టర్ చూస్తుంటే.. సినిమాలోని కాళిమాతా లుక్‌లా కనిపిస్తోంది. ఆమెను చాలా పవర్‌ఫుల్‌గా చూపించబోతున్నట్లు పోస్టర్ చూస్తే అర్థమవుతుంది. అయితే టైటిల్ రోల్ ఎవరు చేస్తున్నారనేది ఇంతవరకు రివీల్ చేయలేదు. రేపు ఇచ్చే అప్‌డేట్‌లో ఈ విషయం తెలియజేస్తారా? లేదా? అనేది తెలియాలంటే మరికొన్ని గంటలు ఆగాల్సిందే. కాగా, ఈ చిత్రంలో శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా నటించబోతున్నాడు. ఆయన ఫస్ట్‌లుక్‌ని కూడా రిలీజ్ చేశారు. ఇండియాలోనే తొలి లేడీ సూపర్ హీరో మూవీగా మహాకాళి రానుంది.

# యానిమల్ సీన్ రిపీట్ కానుందా?

రెబల్ స్టార్ ప్రభాస్, డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'స్పిరిట్'. ఈ ప్రాజెక్ట్ అప్‌డేట్స్ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ గురించి టాలీవుడ్‌లో పలు రకాల రూమర్స్ వినిపిస్తూనే ఉన్నాయి. ఈ మూవీలో ప్రభాస్ తండ్రిగా మెగా హీరో నటించబోతున్నట్లు గతంలో వార్తలొచ్చాయి. స్పిరిట్ చిత్రంలో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్నారని తెగ టాక్ వినిపించింది. అయితే దీనిపై ఇంకా క్లారిటీ రాలేదు. అయితే ఇటీవలే అక్టోబర్ 23న ప్రభాస్ బర్త్‌డేను పురస్కరించుకుని ఆడియో గ్లింప్స్ రిలీజ్ చేశారు. 'సౌండ్ స్టోరీ ఆఫ్ ది ఫిలిం స్పిరిట్' అంటూ 1.31 నిమిషాల ఆడియో గ్లింప్స్ వదిలారు. తెలుగుతో పాటు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ గ్లింప్స్ రిలీజ్ చేశారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన మరో క్రేజీ న్యూస్ వైరలవుతోంది. ఈ చిత్రం కోసం సందీప్ రెడ్డి వంగా బిగ్ ప్లాన్ రెడీ చేసినట్లు తెలుస్తోంది. యానిమల్‌తో బోల్డ్ డైరెక్టర్‌గా ముద్ర వేసుకున్న సందీప్ రెడ్డి.. ప్రభాస్ స్పిరిట్‌లోనూ అదే పంథాను ఫాలో అవుతున్నట్లు అర్థమవుతోంది. అందుకే స్పిరిట్‌లోనూ బోల్డ్ సన్నివేశాలు ఉండనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ మూవీలో ప్రభాస్ ఓ సీన్‌లో నగ్నంగా కనిపించనున్నారని వార్తలొస్తున్నాయి.

## గ్లింప్స్ డైలాగ్ వల్లే రూమర్స్..

ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో ప్రకాశ్ రాజ్ చెప్పిన డైలాగ్.. ఈ వార్తకు బలం చేకూరుతోంది. ఖైదీని బట్టలూడదీసి టెస్టులకు పంపండి అనే చెప్పిన డైలాగ్‌తోనే టాక్ వినిపిస్తోంది. దీంతో ప్రభాస్ సినిమాలో నగ్నంగా కనిపించే ఛాన్స్ ఉందని సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. ఎందుకంటే సందీప్ రెడ్డి వంగా యానిమల్‌లో రణ్‌బీర్ కపూర్ ఓ సీన్‌లో న్యూడ్‌గా కనిపించారు. అదే పంథాను స్పిరిట్ విషయంలో ఫాలో అవుతున్నట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే స్టార్ హీరోలతో బోల్డ్ సీన్స్ చేయించడం ఒక్క సందీప్ రెడ్డికే సాధ్యమని చెప్పొచ్చు. కాగా.. ఈ చిత్రంలో యానిమల్ బ్యూటీ త్రిప్తి డిమ్రీ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ మూవీతో బాలీవుడ్ భామ టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వనుంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన మరో క్రేజీ న్యూస్ వైరలవుతోంది. ఈ చిత్రం కోసం సందీప్ రెడ్డి వంగా బిగ్ ప్లాన్ రెడీ చేసినట్లు తెలుస్తోంది. యానిమల్‌తో బోల్డ్ డైరెక్టర్‌గా ముద్ర వేసుకున్న సందీప్ రెడ్డి.. ప్రభాస్ స్పిరిట్‌లోనూ అదే పంథాను ఫాలో అవుతున్నట్లు అర్థమవుతోంది. అందుకే స్పిరిట్‌లోనూ బోల్డ్ సన్నివేశాలు ఉండనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ మూవీలో ప్రభాస్ ఓ సీన్‌లో నగ్నంగా కనిపించనున్నారని వార్తలొస్తున్నాయి.



# ద గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో సినిమా ట్రైలర్ రిలీజ్

ఒకప్పుడు పెళ్లంటే పెళ్లి మాత్రమే. ఇప్పుడు పెళ్లి అంటే అంతకంటే ముందు చాలా ఉంటాయి. అందులో ప్రీ వెడ్డింగ్ షూట్ ఒకటి. ఇప్పుడు ఈ కాన్సెప్ట్‌పై తెలుగులో ఓ కామెడీ సినిమా తీశారు. అదే 'ద గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో'. మసూద మూవీ ఫేమ్ తిరువీర్ హీరోగా నటిస్తున్నాడు. టీనా శ్రావ్య హీరోయిన్. రాహుల్ శ్రీనివాస్ దర్శకుడు. నవంబర్ 7న మూవీ థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా తాజాగా ట్రైలర్ లాంచ్ చేశారు. ఇది బాగానే నవ్విస్తోంది. ట్రైలర్ బట్టి చూస్తే.. పల్లెటూరిలో ఉండే హీరో ఓ ఫొటోగ్రాఫర్. ఓసారి ఓ జంటకు ప్రీ వెడ్డింగ్ షూట్ చేస్తాడు. అనుకుని పరిస్థితుల్లో షూట్ చేసిన ఫుటేజీ ఉన్న మెమొరీ కార్డ్ పోతుంది. తర్వాత ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? ఈ గండం నుంచి హీరో ఎలా బయటపడ్డాడనేదే స్టోరీలా అనిపిస్తుంది. ట్రైలర్ అయితే నవ్విస్తోంది. కామెడీ కూడా సహజంగా కుదిరింది. మరి మూవీ ఎలాంటి రిజల్ట్ అందుకుంటుందో చూడాలి? నవంబర్ 7న రష్మిక 'ద గర్ల్ ఫ్రెండ్', సుధీర్ బాబు 'జటాధర' చిత్రాలు రిలీజ్ అవుతున్నాయి. వీటితోపాటు ఈ సినిమా కూడా రానుంది. మరి మూడింటిలో ఏది ప్రేక్షకుల్ని అలరిస్తుందో చూడాలి. ఇదే తేదీన తమిళ డబ్బింగ్ బొమ్మ 'ఆర్యన్' కూడా తెలుగులో విడుదల కానుంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com